

● ఈ చిత్రంలో కనిపిస్తున్న చెరువు ఓబుళనాయునిపల్లిది. ఈ చెరువులో ఫారంపాండ్ గుంతలను ఎక్స్‌కవేటర్‌తో తీయించారు. వాటికి రూ.లక్షల్లో బిల్లులు పెట్టి కూలీలకు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు మీకింత మాకింతగా పంచేసుకున్నారు. ఇష్టారాజ్యంగా డగౌట్ ఫారంపాండ్‌లను తీయించి ఆ మట్టిని అమ్మేసుకున్నారు. ఎక్స్‌కవటేర్‌లతో గుంతలు తీసినా వాటికి కొత్తరూపురేఖలు ఇచ్చి, వాటికి ఐడీని సృష్టించి బిల్లులు చేసుకున్నట్లు సమాచారం.



● ఈ చిత్రంలో కనిపిస్తున్న ఫారంపాండ్ గుంత రేగాటిపల్లిలో ఉన్న పాతది. అయితే ఇదేగుంతకు ప్రతిఏడాది బిల్లులు పెట్టి దోచేశారు. ఇదేగుంతకే పదేపదే బిల్లులుపెట్టి లక్షల నిధులు డ్రాచేశారు. కూలీలకు అరకొరగా ఇచ్చి మిగిలినదంతా అప్పటి ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, మిగతా అధికారులు అంతా కలిసి వాటాలు పంచుకున్నట్లు తెలిసింది. టెక్నికల్ అసిస్టెంట్ల బంధువుల పేరుతో కూడా బిల్లులు మంజూరుచేసి దోచేశారు. పాతచెక్‌డ్యాంలకు కొత్త రూపు ఇచ్చి రూ.లక్షల్లో బిల్లులు చేసుకున్నారు. అడుగులోతు కూడా మట్టిని తీయకుండా తూతుమంత్రంగా చేసి బిల్లులు కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.



● ఈ చిత్రంలో కనిపిస్తున్న డగౌట్ ఫారంపాండ్ ఉప్పునేసినపల్లి గ్రామ పంచాయతీలోని గరుడంపల్లి గ్రామం వద్ద వంక సమీపంలో ఉంది. గత ప్రభుత్వంలో ఇదే ఫారం పాండ్‌కు రెండు సారు బిల్లులు పెట్టుకున్నారు. రెండేళ్లుగా ఇదేగుంతలోనే పనులు చేసినట్లు రికార్డులు చేశారు. అయినా గత ఏడాది ఇదేగుంతలో మళ్లీ పనులు చేసి అడుగులోతు కూడా లేకుండా పైపైపనులు చేసి బిల్లులు డ్రా చేసుకున్నారు.

అవినీతి బేరం..!

సామాజిక తనిఖీ ముసుగులో వసూళ్లపర్వం...?

- 12.20కోట్ల ఉపాధి పనులకు సోషల్ ఆడిట్
- రూ.లక్షకు రూ.750 చొప్పున ఇచ్చేలా బేరసారాలు...?
- ఉపాధిహామీలో అవినీతి బహిర్గతమయ్యేనా..?

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): చేసిన అవినీతి పనులను మామూళ్లతో కప్పి పెట్టేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. ఉపాధి పనుల్లో జరిగిన అవినీతిని నిగ్గు తేల్చడానికి సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సామాజిక తనిఖీ సక్రమంగా జరిగితే అనేక అవకతవకలు బహిర్గతమయ్యే అవకాశం ఉంది. దీంతో అప్పట్లో అక్రమాలకు పాల్పడిన వారిలో ఆందోళన నెలకొంది. గత ప్రభుత్వంలో కొందరు స్వార్థపరులు చేసిన పనులకే సోకులు చేసి పదే పదే బిల్లులు కాజేస్తూ ఉపాధి పథకం లక్ష్యాన్ని నీరు గార్చారు. మరి కొన్ని చోట్ల కూలీలు పనులకు రాకున్నా బిల్లులు మంజూరు చేస్తూ వాటాలు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పంచాయతీరాజ్, హౌసింగ్, హార్టికల్చర్ పనుల్లో కూడా చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈక్రమంలోనే 2023-24సంవత్సరానికి సంబంధించి జరిగిన ఉపాధి పనులకు ప్రస్తుతం సామాజిక తనిఖీ బృందం సోషల్ ఆడిట్ నిర్వహిస్తోంది. అందులో భాగంగానే ప్రస్తుతం ధర్మవరం మండలంలో సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో పనులను పరిశీలిస్తోంది. సామాజిక తనిఖీ బృందం సభ్యులు గత వారం మండల కార్యాలయానికి వచ్చి రికార్డులు పరిశీలించారు. వీటికి సంబంధించి గ్రామాల్లో తనిఖీలు చేయాల్సి ఉంటుంది. ఈక్రమంలో అవినీతి బయటకు రాకుండా ఉండేందుకు తనిఖీ బృందాలతో వైసీపీ సానుభూతిపరులైన కొంత మంది మాజీఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి అధికారులు బేరం కుదుర్చుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రూ.12.20కోట్లకు సోషల్ ఆడిట్

ధర్మవరం మండల వ్యాప్తంగా 2023-2024 సంవత్సరానికి ఉపాధిహామీ పనులతో పాటు పంచాయతీ రాజ్ పనులకు, హౌసింగ్ బిల్లులకు సంబంధించి రూ.12.20కోట్లు నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం వీటికి సామాజిక తనిఖీ(సోషల్ఆడిట్) చేయడానికి సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. ప్రస్తుతం ఈ సోషల్ ఆడిట్ బృందం గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ఈ బృందం పనిప్రదేశాలు, పనులను పరిశీలించి అందులో జరిగిన అవినీతి, అక్రమాలను వెలికితీయాల్సి ఉంది.



రూ. లక్షకు రూ. 750..

మండలంలో ఉపాధి పనులతో పాటు సీసీరోడ్లు, గ్రామ సచివాలయాలు, హౌసింగ్ బిల్లులు తదితర వాటికి సంబంధించి రూ.12.20కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. వీటికి సంబంధించి రికార్డులు సరిగా లేవు. అలాగే తూతుమంత్రంగా పనులు చేపట్టడం, నాసిరకంగా పనులు చేసి బిల్లులు భోంచేశారని ఆరోపణలు ఉన్నాయి. సామాజిక తనిఖీ బృందం రాకతో తమ అవినీతి బహిర్గతమవుతుందేమోనని అక్రమార్కులు ఆందోళన చెందుతున్నారు. ఈక్రమంలోనే వైసీపీ పాలనలో పని చేసిన ఉపాధి హామీ అధికారులు ఇప్పటికీ ఉండటంతో వారిని మధ్యవర్తిగా ఏర్పాటు చేసుకుని సామాజికి తనిఖీ బృందంతో బేరసారాలు సాగించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ.లక్షకు రూ.750లు చొప్పున ఇచ్చేలా బేరం కుదుర్చుకుని, ఇబ్బందిలేకుండా చేయాలని కోరినట్లు తెలుస్తోంది. సుమారు రూ.10లక్షల వరకు ఇచ్చేలా బేరసారాలు కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. సామాజిక బృం దానికి ముడుపులు ఇచ్చేందుకు టెక్నికల్ అసిస్టెంట్లు ప్రధానపాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. సామాజిక తనిఖీ బృందంతో పాటు పలువురు ఉపాధిహామీ అధికారులకు కూడా మామూళ్లలో వాటా ఉన్నట్లు తెలుస్తోంది.

పనులకు రాకున్నా బిల్లుల చెల్లింపు...?

మండలంలోని పోతులనాగేపల్లి, తుంపర్తి, బడన్నపల్లి, మల్లాకాల్వ, మల్కాపురం, గొట్లూరు, గరుడంపల్లి, కుణుతూరు, రేగాటిపల్లి, ఓబుళనాయునిపల్లి, నేలకోట, ఏలుకుంట్ల ఈ గ్రామాల్లో ఎక్కువ శాతం అవినీతి జరిగినట్లు సమాచారం. కూలీలు పనులకు రాకున్నా ఒప్పందం మేరకు వారి పేరుతో బిల్లులు చేసి, వచ్చిన సొమ్మును చెరి సగం పంచుకున్నారనే ఆరోపణలు ఉపాధి సిబ్బందిపై ఉన్నాయి. ఈ గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం పారదర్శకంగా తనిఖీలు చేస్తే అవినీతి బయటపడుతుందని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. గత సోషల్ఆడిట్‌లో కూడా ఈ గ్రామాలకు సంబంధించి రికవరీ తేలడంతో ఫీల్డ్అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు రికవరీ సొమ్ము చెల్లించినట్లు రికార్డులు చెబుతున్నాయి.

చర్యలు తప్పవు

సామాజిక తనిఖీల్లో చేతివాటం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు తప్పవు. ఇప్పటికే ధర్మవరం మండలంలో గ్రామాల వారిగా ఉపాధిహామీ పనులు, ఇతరశాఖల వారీగా జరిగిన పనులకు సోషల్ఆడిట్ జరుగుతోంది. పారదర్శకంగా తనిఖీలు చేపట్టాలి. ఉపాధిహామీ సిబ్బంది కూడా తనిఖీబృందానికి డబ్బులు ఇచ్చినట్లు, తనిఖీబృందాలు డబ్బు తీసుకుని తూతూమంత్రంగా తనిఖీలు చేసినట్లు మా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

- విజయప్రసాద్, ఉపాధి హామీ పీడీ, శ్రీసత్యసాయి జిల్లా

సీమను సస్యశ్యామలం చేయాలన్నదే

బాబు ఆశయం

● ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



లైనింగ్ పనులకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

బుక్కపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాయలసీమను సస్యశ్యామలం చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయమని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జానకంపల్లి వద్ద రూ.425కోట్లతో చేపట్టిన హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను ఆమె సోమవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తిగా నిర్వీర్యమయ్యాయన్నారు. జిల్లాకు కియ, హంద్రీనీవా ప్రాజెక్టులు గొప్ప వరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవతోనే శ్రీ సత్యసాయి జిల్లాలో కియ కార్ల పరిశ్రమ ఏర్పడిందన్నారు. దీని ద్వారా వేలాదిమందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. హంద్రీనీవా కాలువ లైనింగ్ చేయవడం వలన రైతులకు నష్టం ఉండదన్నారు. దీని వలన 1టీఎంసీ నీరు పొదుపు అవుతుందన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో 193 చెరువులతోపాటు రెండు రిజర్వాయర్లు నింపడానికి హంద్రీనీవా లైనింగ్ పనులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఉమ్మడి జిల్లాలో వీటివలన దాదాపు ఆరులక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశముందన్నారు. మాజీ మంత్రి పల్లె మాట్లాడుతూ లైనింగ్ పనులను వందరోజు ల్లో పూర్తి చేయాలన్న లక్ష్యంతో బీఎస్ఆర్ కంపెనీ ముందుకు వచ్చిందన్నారు. నియోజకవర్గంలో కాలువపైన కొన్నిచోట్ల బ్రిడ్జిలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వాటికి బ్రిడ్జిలు నిర్మించాలని హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులను కోరారు. కాలువల ద్వారా చెరువులకు నీటిని విడుదల చేసే ప్రాంతాల్లో గేట్లు, షట్టర్లు ఏర్పాటు చేసేలా చర్యల తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ పత్తి చంద్రశేఖర్, బీఆర్ఎస్ డైరెక్టర్లు పూర్ణప్రసాద్, వెంకటరాము, మంజునాథ్, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, ఇరిగేషన్ ఎస్ఈ స్వరూప్, ఈఈ మురళి, డీఈలు రేణుక, వేణుగోపాల్‌రెడ్డి, ప్రసాద్‌రావు, ఏఈలు శ్రీకాంత్‌రెడ్డి, షబ్బానా, మధు, లక్ష్మీపతి, హథిరామ్, తహసీల్దార్ షాబుద్దీన్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండలకన్వీనర్ చింతా మల్లిరెడ్డి పాల్గొన్నారు.

వేసవిలోనూ కృష్ణమ్మ పరవళ్లు



మరువ పారుతున్న ముత్యాల చెరువు

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నిత్యం కరువుకాటకాలతో విలవిలలాడే జిల్లాలో వేసవిలో కూడా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. టీడీపీ అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబునాయుడు సత్యసాయి జిల్లాకు ఎంతగానో ప్రాధాన్యత ఇచ్చారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఈ నెల 12న హెచ్ఎన్ఎస్ అధికారులతో కలిసి గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు నీరు విడుదల చేశారు. దీంతో సమీప ప్రాంతాల చెరువులకు నీరు అందిస్తున్నారు. ఈ క్రమంలో పెనుకొండ సమీపంలోని ముత్యాల చెరువుకు కృష్ణా జలాలు తరలి రావడంతో సోమవారం మరువపారింది. దీంతో ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం: కలెక్టర్

కదిరిలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజల నుంచి 420 ఫిర్యాదుల స్వీకరణ

కదిరి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీల పరిష్కారానికి మానవతా దృక్పథంతో కృషి చేయాలని అధికారులు ఆదేశించారు. ప్రజల నుంచి 420 ఫిర్యాదులు స్వీకరించామన్నారు. నిర్ధిష్ట సమయంలోపు ఫిర్యాదులను పరిశీలించి, పరి ష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో రెవిన్యూ అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయన్నారు. పదే పదే వచ్చే వినతులను ప్రత్యేకంగా పరిశీలిస్తామని అన్నారు. వచ్చిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. చాలా వరకు భూసమస్యలు, రీసర్వేపై వచ్చాయని వివరించారు. ఫిర్యాదులు అందిన వెంటనే క్షుణ్ణంగా పరిశీలించి, అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఆర్డీఓ వీవీఎస్ శర్మ, డీపీఓ సమత, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, పట్టుపరిశ్రమశాఖ జేడీ పద్మావతి, పీడీ సుదర్శన్, సీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ వెంకటరమణారెడ్డి, ల్యాండ్ సర్వే ఏడీ విజయశాంతిబాయి, జడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఎల్‌డీఎం రమణకుమార్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, డీసీహెచ్ఓ తిప్పేంద్రనాయక్, గిరిజన సంక్షేమ శాఖ మోహన్‌రావు, ఆర్‌డబ్లు ఎస్ఈ మల్లికార్జునయ్య, డీఎంహెచ్ఓ ఫైరోజ్‌బేగం, ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మి పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వర విచారణ: ఎస్పీ



బాధితుడితో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై సత్వరమే విచారణ జరిపి పరిష్కరించాలని ఎస్పీ రత్న.. సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి ఎస్పీ 75 ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదిదారులతో ఎస్పీ ముఖాముఖిగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులకు ప్రాధాన్యతనిచ్చి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీలు ఆదినారాయణ, శ్రీనివాసులు, ఎస్బీసీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, ఎస్బీ ఎస్ఐ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్, ఎమ్మెల్యే కందికుంట



యజ్ఞంలో పాల్గొన్న వేద పండితులు

కొనసాగిన యజ్ఞం

ఘనంగా సాయీశ్వర లింగార్చన

పుట్టపర్తి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): విశ్వశాంతి లోకసంరక్షణ కోసం చేపట్టిన అతిరుద్ర మహాయజ్ఞం సోమవారం కొనసాగింది. సాయికుల్వంతు సభామండపంలో ప్రధాన పండితులు శ్రీనివాసన్ ఆధ్వర్యంలో వందమంది పండితులు 11 హోమాలను నాలుగు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రశాంతినిలయంలో ప్రత్యేక షెడ్‌ను ఏర్పాటు చేసి అందులో సాయీశ్వర లింగార్చన చేపట్టారు. వేదపండితుల ఆధ్వర్యంలో వందలాది మంది భక్తులు పాల్గొని అష్టోత్తర శతసహస్ర సాయీశ్వరలింగార్చన చేశారు. శివలింగాలతో సత్యసాయి ప్రతి రూపాన్ని ఏర్పాటుచేశారు. మహాగణపతి పూజతో లింగార్చన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహాసంకల్పం కలశస్థాపన, లింగాభిషేకం నిర్వహించారు. లింగార్చనలో సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జేరత్నాకర్, స్థానిక ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొన్నారు.



సత్యసాయి రూపంలో ఏర్పాటుచేసిన శివలింగాలు

ముందుకు సాగని ఏఓల ప్రమోషన్లు..!

ఎంపీడీఓ ఆఫీసుల్లో నాలుగు పోస్టుల ఖాళీ

22మంది సీనియర్ అసిస్టెంట్లతో ప్యానల్ రెడీ

పలు అభ్యంతరాలు రావడంతో బ్రేక్



అనంతపురం విద్య, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో జిల్లా పరిషత్, మండల పరిషత్‌లో ఉద్యోగుల ప్రమోషన్ల ప్రక్రియ ముందుకుసాగకపోవడంతో పోస్టుల భర్తీ పెండింగ్ పడుతూ వస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఇటీవల ఖాళీగా నాలుగు 4 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏవో) పోస్టులను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని చూశారు. దీనికి సంబంధించి సీనియర్ అసిస్టెంట్స్ ప్యానల్ సీనియారిటీ జాబితా సిద్ధం చేసింది. అయితే అందులో అభ్యంతరాలు వ్యక్తం కావడంతో ఈ ప్రక్రియను పక్కనబెట్టారు.

ప్యానల్‌పై అభ్యంతరాలతో ఆగిందా..?

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏవో) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నల్లమాడ ఎంపీడీఓ కార్యాలయం, ఎన్పీకుంట ఎంపీడీఓ కార్యాలయం, అగళి ఎంపీడీఓ కార్యాలయం, సోమందేపల్లి ఎంపీడీఓ కార్యాలయాల్లోని ఏవో పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఈ నాలుగు ఏఓ పోస్టులను సీనియర్ అసిస్టెంట్లకు ప్రమోషన్ల ఇచ్చి భర్తీ చేయాల్సి ఉంది. ఈ క్రమంలో 2024-2025 ఏడాదికి సంబంధించిన 22మందితో కూడిన సీనియర్ అసిస్టెంట్ల ప్యానల్ లిస్టు(తాత్కాలికం)ను ఇటీవల జడ్పీ అధికారులు సిద్ధం చేశారు. ఈ ప్యానెల్‌పై ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఎంపీడీఓ కార్యాలయాలకు జడ్పీ అధికారులు ఉత్తర్వులు పంపారు. ఈప్రక్రియను జడ్పీ అధికారులు తీవ్ర జాప్యం చేసినట్లు తెలిసింది. కుంటిసాకులు చెబుతూ అయినవాళ్లకు పట్టంకట్టాలన్న ధోరణిలో కొందరు జడ్పీ ఉద్యోగులు చక్రం తిప్పడంతో అనర్హులను సైతం ప్యానల్‌లో పెట్టారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్యానల్ సిద్ధం చేయడంలో కూడా కొన్ని తప్పులు జరగడంతో కొందరు ఉద్యోగులు అభ్యంతరాలు తెలిపినట్లు సమాచారం. గత ఏడాది డిసెంబరులోనే ప్యానల్ సిద్ధమైనా ఇప్పటి వరకూ ఫైనల్ ప్యానల్ జాబితాను సిద్ధం చేయలేదు. ఫలితంగా ఏవోల ప్రమోషన్ల ప్రక్రియ ముందుకు కదలడం లేదు.

ప్యానెల్ పరిశీలించి పరిష్కరిస్తాం

గతంలో తాత్కాలిక ప్యానల్ రెడీ చేశారు. కొన్ని అభ్యంతరాలు వచ్చాయి. వాటిని పరిశీలిస్తున్నాం. డిప్యూటీ సీఈఓతో కొంత చర్చించి ప్యానల్ లిస్టును సిద్ధం చేస్తాం. ఏవోల ప్రమోషన్ల ప్రక్రియ పూర్తయ్యేలా చూస్తాం.

-రామచంద్రారెడ్డి, సీఈఓ, జడ్పీ

బాధ్యతల స్వీకరణ



ఎస్ఈ శేషాద్రి శేఖర్

అనంతపురంరూరల్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈగా శేషాద్రి శేఖర్‌ను నియమిస్తూ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్ రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనేపథ్యంలో సోమవారం సాయంత్రం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో కళ్యాణదుర్గం డివిజన్ ఈఈగా పనిచేస్తూ పదిరోజుల కిందట ఉద్యోగోన్నతి పొంది తిరుపతి కార్పొరేట్ కార్యాలయానికి వెళ్లారు. ఈక్రమంలోనే ఈయనను జిల్లా ఎస్ఈగా నియమించారు. ఇక్కడ ఎస్ఈగా పనిచేస్తున్న సంపత్ కుమార్‌ను కార్పొరేట్ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని సీఎండీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సంపత్ కుమార్ గత ఏడాది జూలైలో బాధ్యతలు స్వీకరించారు. ఆరు నెలలకే ఈయన్ను బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది.

పాడికి ప్రోత్సాహం

కూటమి ప్రభుత్వం చొరవ

పశువైద్య శిబిరాలు విజయవంతం

ఆవులు, గేదెలు, ఎద్దులకు నట్టల నివారణ మందు

గొర్రెలు, మేకలకు డీ వార్మింగ్

రైతుల్లో హర్షం



పశు ఆరోగ్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు (ఫైల్)

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చాక పాడి పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉచితంగా పశుగ్రాసం పెంపకానికి ఉపాధి నిధులు సమకూర్చింది. పశువులు, జీవాలకు మినీగోకులం షెడ్లను మంజూరు చేసింది. ఉపాధి హామీ పథకం నిధులతో పల్లె పండుగ పేరుతో సిమెంటు రోడ్ల నిర్మాణం చేపడుతోంది. పాడి పశువులకు ఉపయోగపడేలా గోకులం షెడ్ల నిర్మాణాలను చేపట్టింది. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పశుపోషణకు అవసరమైన వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

7,900 పశువులకు నట్టల నివారణ మందు

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పాడి పశువులకు కనీస అదరణ లభించలేదు. కూటమి అధికారంలోకి వచ్చాక పాడి పరిశ్రమకు ప్రోత్సాహం లభిస్తోంది. మూగజీవాలను బతికించాలన్న లక్ష్యంతో పశువైద్యశిబిరాలు నిర్వహించింది. మండలంలో పశు ఆరోగ్య శిబిరాలు విజయవంతమయ్యాయి. మండలవ్యాప్తంగా అవులు, ఎద్దులు 7,900, గేదెలు, దున్నలు 4,200, గొర్రెలు 72,500, మేకలు 7,900, కోళ్ల 5,000, పందులు 40 పెంపుడు కుక్కలు 600 ఉన్నాయి. గాలికుంట వ్యాధి సోకకుండా 7,900 పశువులకు నట్టల నివారణ మందు తాపించినట్లు మండల పశువైద్యాధికారి వెంకటరెడ్డి తెలిపారు. ఎన్నడూలేని విధంగా పెద్ద పశువులకు నట్టల నివారణ మందులను ప్రభుత్వం సరఫరా చేసింది.

పశువైద్య సేవలను వినియోగించుకోవాలి

పాడి రైతులు ఉచిత పశువైద్య సేవలు వినియోగించుకోవాలి. పశుసంతతి అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ప్రభుత్వం మందులను అందుబాటులో ఉంచింది. పశువులకు నట్టల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు, గర్భకోశ సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు చేశాం.

-వెంకటరెడ్డి, పశువైద్యాధికారి, బొమ్మనహాళ్

రైళ్లు కావాలి..!

రాజధానికి వెళ్లాలంటే కష్టాలు..!

- నెలముందే ప్లానింగ్ చేసుకోవాలి..
- రిజర్వేషన్ దొరికినా తప్పని తిప్పలు
- పది రెట్లు పెరిగిన రద్దీ
- కొత్తవి రావు.. ఉన్నవీ రద్దు..



గుంతకల్లు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన తర్వాత విజయవాడకు రైళ్లలో రద్దీ పదింతలు పెరిగింది. తగినన్ని రైళ్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నవ్యాంధ్ర ఏర్పాటు తర్వాత బెజవాడ ఎడ్యుకేషన్ హబ్‌గా మారింది. కళాశాలలు, కోచింగ్ సెంటర్లకు రాష్ట్ర రాజధాని ఆలవాలమైంది. హైదరాబాద్ నుంచి కూడా సీఏ, నీట్, ఐఐటీ, జేఈఈ కోచింగ్ కోసం విజయవాడకు విద్యార్థులు కుప్పలుతెప్పలుగా వస్తున్నారు. రాయలసీమ జిల్లాల నుంచి కూడా విద్యార్థులు వెళ్తున్నారు. వారిని చూసి రావడానికి, తీసుకురావడానికి, వదలడానికి, వెళ్లడానికి విద్యార్థుల తల్లిదండ్రులు రైలు బెర్త్‌ల కోసం పెద్ద కసరత్తే చేయాల్సి వస్తోంది. రిజర్వేషన్ దొరికినంత మాత్రాన ఇబ్బందులు ఉండవులే అనుకుంటే తప్పులో కాలేసినట్లే. స్లీపర్ కోచ్‌లన్నీ వెయిటింగ్ లిస్టు ప్యాసింజర్లతో కిటకిటలాడుతుంటాయి. టాయిలెట్లు సైతం బెర్త్ లభించని ప్రయాణీకులతో నిండిపోయి ఉంటాయి. రైలు బెర్త్ దొరక్కపోతే బస్సులో వెళ్లడం కూడా ఓ యజ్ఞంగా మారుతుంది. విజయవాడకు సరైన బస్సుల్లేక రైల్వే డివిజన్ కేంద్రంలోని ప్రజలు అవస్థలు పడుతున్నారు. విజయవాడకు వెళ్లాలంటే నెల ముందే ప్రయాణ ఏర్పాట్లు చేసుకోవాలి. లేదంటే కష్టాలు తప్పవు. గుంతకల్లు రైల్వే జోన్ దక్షిణ మధ్య రైల్వే నుంచి సౌత్ కోస్టు రైల్వే జోన్‌లోకి మార్చిన తరువాతైనా గుంతకల్లు-విజయవాడ మధ్య రైళ్ల పరుగు పెడతాయేమోనని స్థానికులు, జిల్లా వాసులు గంపెడాశలు పెట్టుకున్నారు.

ఆ రెండు రైళ్లే గతి

రైల్వే డివిజన్ కేంద్రమైన గుంతకల్లు రైల్వే జంక్షన్ నుంచి కేవలం రెండంటే రెండు డెయిలీ ట్రెయిన్లే ఉండటంతో విజయవాడకు రిజర్వేషన్ దొరకడం గగనంగా మారింది. బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి డెయిలీ ఎక్స్‌ప్రెస్ (నం. 18464), అమరావతి డెయిలీ ఎక్స్‌ప్రెస్ (నం. 17226) రైళ్లు మినహా ఇతర రైళ్లేవీ గుంతకల్లులో రైలెక్కేవారికి పెద్దగా ఉపయోగకరంగా లేవు. వీటిలో ప్రశాంతి భువనేశ్వర్ వరకూ వెళ్తుండటంతో కర్ణాటక, ఏపీ, ఒడిశా రాష్ట్రాలవారు ఇందులో ప్రయాణిస్తారు. ఈ కారణంగా రైలు ఎప్పుడూ కిటకిటలాడుతూ ఉంటుంది. ఇందులో నెల ముందు కూడా రిజర్వేషన్ దొరకదు. 60 రోజుల ముందు రిజర్వేషన్ ప్రక్రియ ప్రారంభమౌతుండగా.. నాలుగైదు రోజుల్లోనే బెర్తులు భర్తీ అయిపోతున్నాయి. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌తో పోలిస్తే హుబ్లీ-నరసాపూర్ వెళ్లే డెయిలీ ఎక్స్‌ప్రెస్‌లో పరిస్థితి కొంత నయంగా ఉంటోంది. ఈ రైలు తక్కువ దూరం ప్రయాణిస్తున్నందున, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌తో పోలిస్తే రిజర్వేషన్లు ఇందులో సులభంగా లభిస్తాయి. సాధారణ రోజుల్లో పక్షం ముందు రిజర్వేషన్ ఈ రైలుకు దొరికే పరిస్థితులున్నాయి. కాగా అర్ధరాత్రి దాటాక గుంతకల్లుకు వచ్చే హుబ్లీ-విజయవాడ ఎక్స్‌ప్రెస్ (17329) రైలు మధ్యాహ్నం విజయవాడకు చేరుకుంటుండటంతో స్థానికులు ఆ రైలులో వెళ్లడానికి ఆసక్తి చూపట్లేదు. అలాగే వాస్కో-హౌరా ఎక్స్‌ప్రెస్ రైలు గుంతకల్లు మీదుగా వెళ్తున్నా.. ఇది వారంలో 4 రోజులు మాత్రమే నడుస్తుండటంతో అవసరానికి ఉపయోగపడటంలేదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

గుత్తిలోనూ సమస్యే..

గుంతకల్లు మీదుగా కాకుండా గుత్తి నుంచి నేరుగా విజయవాడకు వెళ్లే రైళ్లు కొన్ని ఉన్నా అక్కడి ప్రజలకు కూడా సమస్యలు ఎదుర్కొంటున్నారు. గుత్తి మీదుగా వెళ్లే ధర్మవరం-మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్ రైలు (నం. 17216) ఇంజిన్ చేంజింగ్ కారణంగా ఆలస్యమవుతోందని చెప్పి గుత్తి ఫోర్ట్ స్టేషన్ మీదుగా బైపాస్ లైన్‌లో పంపుతున్నారు. దీంతో గుత్తి పట్టణవాసులకు ఈ రైలులో వెళ్లడం సమస్యగా మారింది. అలాగే కొండవీడు ఎక్స్‌ప్రెస్ (నం. 17211/12) రైలు వారంలో 3 రోజులు మాత్రమే నడుస్తుండటంతో విజయవాడకు వెళ్లడానికి అవసరానికి ఉపయోగపడకుండా పోతోందని స్థానికులు వాపోతున్నారు. కొండవీడు ఎక్స్‌ప్రెస్ గుత్తి-పెండేకల్లు రూటులో వెళ్తుండగా ఆ రైలు గుత్తి స్టేషన్‌లోకి తెస్తున్నారు. మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్ ఎర్రగుంట్ల-నంద్యాల సెక్షన్ మీదుగా వెళ్లాల్సి ఉండటంతో దీనిని గుత్తి స్టేషన్‌కు తేకుండా గుత్తి ఫోర్టు స్టేషన్‌లో ఆపి బైపాస్‌లో పంపుతున్నారు. మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్‌ను గుత్తి జంక్షన్‌లోకి తెస్తే ఇంజిన్‌ను వెనుక వైపునకు మార్చాల్సి ఉండడంతో ఆలస్యం అవుతుందన్న కారణంగా ఆ రైలును గుత్తి ఫోర్టుకే పరిమితం చేశారు. ఆలస్యం అయినాకానీ ఆ రైలును గుత్తికి తేవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రైళ్ల సంఖ్య, ఫ్రీక్వెన్సీ పెంచాలి

రాష్ట్ర రాజధానికి వెళ్లే ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిన నేపథ్యంలో రైళ్ల సంఖ్య, కొన్ని రైళ్ల ఫ్రీక్వెన్సీని పెంచాలని రాయలసీమ జిల్లాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో నడిచిన యశ్వంతపూర్-విజయవాడ ప్యాసింజరు, హుబ్లీ-విజయవాడ ప్యాసింజరును పునరుద్ధరించాలని అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల ప్రజలు కోరుతున్నారు. విశాఖపట్టణం-తిరుపతి-కదిరి-ధర్మవరం మధ్య నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను గుంతకల్లు వరకూ పొడిగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇవేకాక గుంతకల్లు రైల్వే డివిజన్ సౌత్ కోస్టల్ రైల్వే జోన్‌లోకి మారినందున విశాఖ-విజయవాడ-గుంటూరు-గుంతకల్లు రైల్వే డివిజన్ల మధ్య కనెక్టివిటీ పెంచాల్సిన పరిస్థితుల్లో కొత్త రైళ్లను నడపాలని డిమాండ్లు ఉన్నాయి. ఈ మార్గంలో ఎక్స్‌ప్రెస్, ఫాస్ట్ ప్యాసింజరు రైళ్లను ప్రవేశపెట్టాలని కోరుతున్నారు. గుంతకల్లు నుంచి ప్రారంభమై విశాఖ వరకూ వెళ్లే ఎక్స్‌ప్రెస్, ప్యాసింజరు రైళ్లను ఏర్పాటుచేయాలని రైల్వే ఉద్యోగులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం నరకమే

విజయవాడకు వెళ్లి రావడానికి ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఏమాత్రం అనువుగా ఉండదు. రిజర్వేషన్ దొరకదు, దొరికినా అడుగు వెయ్యలేని విధంగా వెయిటింగుల లిస్టు ప్రయాణికులు టాయిలెట్ల వరకూ కిక్కిరిసి కూర్చుని ఉంటారు. పెరిగిన రద్దీని దృష్టిలో ఉంచుకుని కొత్త రైళ్లను నడపాలి. నిలిపివేసిన రైళ్లను పునరుద్ధరించాలి.

-తారకేశ్వర్, ఎల్ఐసీ ఉద్యోగి, గుంతకల్లు



మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్‌ను గుత్తి జంక్షన్‌లోకి నడపాలి..

గుత్తి ఫోర్టు మీదుగా వెళ్తున్న మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్‌ను గుత్తి రైల్వే జంక్షన్‌లోకి తీసుకురావాలి. గుత్తి ఫోర్టు స్టేషన్‌కు వెళ్లి రైలెక్కడం కష్టంగా ఉంటోంది. అలాగే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో అసలు ప్రయాణం చేయలేని పరిస్థితి నెలకొంది. తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను ధర్మవరం నుంచి గుత్తి మీదుగా గుంతకల్లు వరకూ పొడిగించాలి.

-సుధీర్, గుత్తి

కలవర పెడుతున్న జీబీఎస్

ఆరునెలల క్రితమే రెండు కేసులు

సాధారణ వైద్యంతోనే అప్పుడు నయం

జిల్లా ఆసుపత్రిలో అప్రమత్తం

అనంతపురంటౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జీబీఎస్ (గులియన్ బారే సిండ్రోమ్) వ్యాధి జిల్లా వాసులను కలవరపెడుతోంది. ఈ వ్యాధి ముందు నుంచి ఉన్నా అపుడు పెద్దగా ప్రభావం చూపలేదు. ప్రస్తుతం ఈవ్యాధి బారిన పడినవారు తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో పాటు రాష్ట్రంలోని ప్రకాశం, శ్రీకాకుళం జిల్లాలో ఇద్దరు చనిపోవడం.. రోజురోజుకు కేసులు పెరుగుతుండడంతో ఆందోళనకు గురిచేస్తోంది. జిల్లాలో ఆరు నెలల క్రితమే ఈ వ్యాధి లక్షణాలు ఉన్న ఇద్దరు రోగులు వృద్ధుడు, బాలుడు జిల్లా ఆసుపత్రిలో చేరి చికిత్స పొంది కోలుకుని వెళ్లినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు చెబుతున్నారు. తర్వాత ఇప్పటి వరకు అలాంటి కేసులు ఆసుపత్రికి రాలేదనంటున్నారు. ఇపుడు రాష్ట్రంలో జీబీఎస్ ప్రభావం అధికంగా కనిపిస్తుండడం, ఇంతకు ముందే జిల్లాలోను ఇలాంటి కేసులు రావడంతో ఆందోళన చెందుతున్నారు. ఇది అంటువ్యాధి కాదంటున్నా ప్రజలు భయపడుతున్నారు. దీంతో జిల్లా ఆసుపత్రికి చికిత్స కోసం వస్తున్న ప్రతి రోగిపై డాక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టారు. జీబీఎస్ లక్షణాలు ఉన్నాయా అని జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు. ఇక్కడ జీబీఎస్ కేసులు లేకపోయినా ప్రతిరోజూ రాష్ట్రశాఖ అధికారులకు సమాచారం ఇస్తున్నామని సూపరింటెండెంట్ పేర్కొన్నారు. ఎలాంటి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయలేదని ఆయన తెలిపారు. వ్యాధి విషయంలో ఆసుపత్రిలో అప్రమత్తంగా ఉన్నామని, అవసరమైన వైద్యం అందిస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని ఆయన అన్నారు.



కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై ధాన్యం రాసులు పోసుకొని ఆందోళన చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు, రైతులు

గిట్టుబాటు ధరతో ప్రభుత్వమే కొనాలి

ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి

కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా

అనంతపురం కల్చరల్, టౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మిరప, పత్తి, పప్పుశనగ, సీడ్ జొన్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. 2024-25 ఖరీఫ్, రబీ పంట నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం ప్రకటించి ఆదుకోవాలని కోరుతూ ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం అనంతపురం కలెక్టరేట్ ముందు పప్పుశనగ, జొన్న, మిరప పోసి రైతులు ధర్నా నిర్వహించారు. అంతకుముందు క్లాక్‌టవర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్‌లో పప్పుశనగ సుమారు 57వేల హెక్టార్లలో సాగు చేశారన్నారు. అయితే అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఒక ఎకరాకు 2 నుంచి 3 క్వింటాళ్లు కూడా దిగుబడి రాని పరిస్థితి నెలకొందన్నారు. దీంతో పెట్టిన పెట్టుబడులు సైతం రాక రైతులు ఆందోళనలో పడ్డారన్నారు. ప్రభుత్వం ఎకరాకు రూ.20వేలు పంటనష్ట పరిహారమందించాలని కోరారు. ప్రస్తుతమున్న మద్దతు ధర క్వింటాకు రూ.5650ల ధరను రూ.10వేలకు పెంచి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, ఉపాధ్యక్షుడు శివారెడ్డి, బీహెచ్ రాయుడు, రాజారాంరెడ్డి, మధుసూదన్, రైతుసంఘం నాయకులు పోతులయ్య, వెంకటేష్, నారాయణరెడ్డి, నాగమ్మ పాల్గొన్నారు.

ఎంఏ షరీఫ్ నేడు జిల్లాకు రాక

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మైనార్టీ అఫైర్స్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎంఏ షరీఫ్ మంగళవారం జిల్లాకు రానున్నారు. ఉదయం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహానికి చేరుకుంటారు. 10 గంటలకు కళ్యాణదుర్గం చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన ముస్లిం మైనార్టీల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం 2.00 గంటలకు అనంతపురంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహానికి చేరుకొని.. 3 గంటలకు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖాధికారి, జిల్లా అధికారులతో సమావేశమవుతారు.

వందల నుంచి పదుల్లోకి..

- కనుమరుగవుతున్న అంజూర సాగు
- ఒకప్పుడు వందల ఎకరాల్లో పంట
- వాతావరణ మార్పు, గిట్టుబాటు లేక కుదింపు



అంజూర పంట

రాయదుర్గం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అంజూర పంట సాగు కనుమరుగవుతోంది. దశాబ్దకాలం కిందట ఇక్కడ వందలాది ఎకరాల్లో అంజూర సాగయ్యేది. ఇపుడు కనుచూపు మేరలో పంట కానరావడం లేదు. ముఖ్యంగా బొమ్మనహాళ్ మండలంలోని ఎల్‌బీనగర్ ప్రాంతంలో ఒకప్పుడు వందలాది ఎకరాల్లో పంట సాగయ్యేది. ఇక్కడి నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు విస్తరిస్తూ వచ్చింది. అలాంటిది వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అంజూర పంట కానరాని పరిస్థితి ఏర్పడింది.

విదేశాలకు ఎగుమతి

ఇక్కడి రైతులు అంజూరపంట సాగులో మెలకువలు తెలుసుకుని, అధిక దిగుబడులు సాధించారు. పండిన పంటను కూడా విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగారు. ఇక్కడి నుంచి చెన్నై, బెంగళూరు లాంటి ప్రాంతాలకు పంటను తరలిస్తూ రూ.లక్షల ఆదాయాన్ని గడించారు. ముఖ్యంగా ఉద్యానపంటల సాగుకు చిరునామాగా ఉన్న ఎల్‌బీనగర్ నుంచి అంజూర పంటను ఎక్కువగా పండించి కాయలు పెద్దసైజులో ఉండేలా జాగ్రత్తలు పాటించి విదేశాలకు ఎగుమతి చేసేవారు. పైగా సుదూర ప్రాంతాల నుంచి అంజూర కొనుగోలు చేయడానికి, పంటలను పరిశీలించడానికి, అవగాహన పొందడానికి ఇక్కడికి అనేకమంది వచ్చేవారు. అలాంటి పరిస్థితి పూర్తిగా తారుమారైంది. గిట్టుబాటు కాకపోవడంతో రైతులు కూడా అంజూర పంటకు స్వస్తి చెప్పి, మొక్కజొన్న లాంటి పంటలను సాగుచేస్తున్నారు.

మార్కెటింగ్ సమస్య

పండించిన అంజూరను ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎగుమతి చేసే పరిస్థితి లేదు. దీనికి ప్రధానంగా అంజూర పంట దిగుబడిలో వాతావరణ ప్రభావం తీవ్రంగా ఉంది. బోరుబావి ద్వారా వచ్చే నీటిలో క్రమేపి ఉప్పుశాతం పెరిగి, దాని ప్రభావం పంటపై పడుతోంది. పండించిన అంజూరను ఒక్కరోజులోనే అమ్మకం చేసేలా మార్కెటింగ్ ఉండాలి. పంట దిగుబడి వచ్చినప్పటికీ కిలో ధర రూ.50లకు మించి మార్కెట్‌లో అమ్మడం కుదరడం లేదు. కనీసం కిలో రూ.80 ఉంటేగానీ గిట్టుబాటు అయ్యే పరిస్థితి లేదు. దీంతో పాటు కాయలు పెద్దసైజులో రావడం లేదు. అంజూర పంను పెద్ద పెద్ద నగరాల చుట్టు పక్కల ప్రాంతాల్లోనే పండిస్తున్నారు. దీంతో ఇక్కడి నుంచి రవాణా చేసి అక్కడి మార్కెట్‌కు అందించడం కష్టంగా మారుతోందని పంట సాగును వదిలేస్తున్నారు. టమోటా పంటలాగా కోత చేసిన వెంటనే అంజూర కూడా అమ్మకం చేసుకోవాల్సి ఉంటుంది. అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో విక్రయించేందుకు ప్రయత్నించినా ఏమాత్రం మార్కెట్ సౌలభ్యం లేదు. అందుకే అంజూర పంటపై ఆసక్తిని తగ్గించారు. ప్రస్తుతం బొమ్మనహాళ్ మండలంలో 13, డీ.హీరేహాళ్ మండలంలో 2.4, కణేకల్లు మండలంలో 7.70 ఎకరాల విస్తీర్ణంలో మాత్రమే పంట సాగు ఉంది.

ప్రభుత్వ ప్రోత్సాహం కరువు

అంజూర సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం కొరవడింది. ప్రభుత్వం ఉద్యానపంటలకు రాయితీలు అందించి, దీనిపై పూర్తిస్థాయిలో చైతన్యపరిస్తే రైతులు అంజూర సాగు వైపు మొగ్గు చూపే అవకాశాలున్నాయి. గత వైసీపీ పాలనలో రాయితీలన్నీ రద్దు చేయడంతో అన్నదాతలు అంజూర సాగుకు దూరమవుతూ వచ్చారు. డ్రిప్ సబ్సిడీ కింద అందించే పథకాన్ని పూర్తిగా రద్దు చేయడంతో పాటు ఉద్యాన అధికారుల అవగాహన సదస్సు కూడా లేకపోవడంతో రైతులు అంజూర సాగును వదిలేసే పరిస్థితికి చేరుకున్నారు.



ప్రోత్సాహకాల కోసం ఎదురు చూస్తున్నాం

కూటమి ప్రభుత్వంలో ప్రోత్సాహకాల కోసం ఎదురు చూస్తున్నాం. గత వైసీపీ పాలనలో ప్రోత్సాహకాలు లేకపోవడంతో ఉద్యానపంటల్లో భాగమైన అంజూర కూడా తగ్గించేశాం. ఒకపుడు 35 ఎకరాల విస్తీర్ణంలో అంజూర పండించా. ఇపుడు కేవలం ఏడు ఎకరాలలో మాత్రమే పంట ఉంది. చాలా సమస్యలు ఉన్నప్పటికీ ఆ పంటను కాపాడుకుంటూ వస్తున్నా. ప్రభుత్వం రాయితీలు అందించి ఆదుకుంటే ఉద్యానపంటల సాగులో మళ్లీ పూర్వ వైభవాన్ని చూపిస్తాం.

-వెంకటేశ్వరరావు, రైతు, ఎల్‌బీనగర్



మార్కెటింగ్ సమస్య ఉంది

అంజూర పంటను పండించినప్పటికీ మార్కెటింగ్ పరంగా చాలా సమస్యలను ఎదుర్కొంటున్నాం. రూ. లక్ష దాకా పెట్టుబడి పెట్టి రోజూ కూలీలను పెడితే మార్కెట్‌లో కిలో రూ. 50లకు కూడా అమ్ముడుపోవడం లేదు. గతంలో ఎకరా విస్తీర్ణంలో పంట పండిస్తే సంవత్సరానికి రూ.1.5లక్షల దాకా ఆదాయం వచ్చేది. ఇపుడు పెట్టుబడి వస్తే చాలనే పరిస్థితి ఉంది. ఇందుకు మార్కెటింగే ప్రధాన సమస్య. అంజూర పంట కనుమరుగు కావడానికి మార్కెటింగ్ కూడా ఒక కారణం.

- రాము, రైతు, ఎల్‌బీనగర్

క్రైం కార్నర్

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య


రంజిత్‌కుమార్

గుమ్మఘట్ట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుగోడు గ్రామంలో సోమవారం సాయంత్రం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రంజిత్‌కుమార్(26) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన హనుమంతరెడ్డి, తిప్పేరమ్మ దంపతుల రెండో కుమారుడు రంజిత్‌కుమార్ రెండేళ్ల క్రితం ఇంజనీరింగ్ పూర్తి చేసి బెంగుళూరులోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. రెండురోజుల క్రితం స్వగ్రామం కలుగోడుకు వచ్చాడు. ఇంట్లోని ఓ గదిలో ల్యాప్‌టాప్‌తో ఉదయం నుంచి పనిచేసుకుంటూ ఉండేవాడని.. సాయంత్రం వెళ్లి తలుపులు తెరిచే చూసేలోగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చేతికి వచ్చిన కొడుకు కళ్లెదుటే శవమై కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. రంజిత్‌కుమార్ ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. కుటుంబసభ్యులు మాత్రం తమ కుమారుడు ఎందుకు చనిపోయాడో అర్థం కావడం లేదని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. గుమ్మఘట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ కిందపడి మహిళ దుర్మరణం

మడకశిరటౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మడకశిర మండలంలోని కొండంపల్లి గ్రామానికి చెందిన కొల్లమ్మ(45) సోమవారం మధ్యాహ్నం ట్రాక్టర్ కిందపడి మృతి చెందారు. స్థానికులు తెలిపిన మేరకు.. నగర పంచాయతీ పరిధిలోని చీపులేటి సమీపంలో ట్రాక్టర్‌లో ఇసుక నింపుకొని మడకశిరకు వస్తుండగా వడ్రపాళ్యం సమీపంలోని మార్కెట్‌యార్డు వద్దకు రాగానే ట్రాలీ బోల్టు కట్ అయ్యింది. దీంతో ఇసుకపై కూర్చొన్న కొల్లమ్మ కిందకు పడిపోవడంతో చక్రం కింద పడి, మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాం-1లో గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు జీఆర్పీ ఎస్‌ఐ మహేంద్ర సోమవారం తెలిపారు. మృతుడి వయసు 62 సంవత్సరాలు ఉంటాయన్నారు. మృతుడి వద్ద ప్రభుత్వ ఆసుపత్రి చీటీ ఉందని, అందులో అతడి పేరు ఆంజనేయులు అని ఉందన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దారిదోపిడీ దొంగల అరెస్ట్


నిందితుల అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐలు

హిందూపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జాతకాలను చెప్పే యువకుడిని బెదిరించి దోపిడీకి పాల్పడిన నలుగురిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈనెల 14న పామిడి మండలం కొండాపురం గ్రామానికి చెందిన బుడగజంగం కుళాయప్ప అనే వ్యక్తి జాతకాలు చెప్తానంటూ ద్విచక్ర వాహనంపై హిందూపురం పట్టణంలోని ఎస్.సడ్లపల్లి గ్రామానికి వచ్చాడు. ఈ సందర్భంగా అదే గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన నాగరాజు, గంగాధర్, శివకుమార్, వెంకటేశు కలిసి కుళాయప్ప ద్విచక్రవాహనం ఆపి తాళాలు లాక్కొని గ్రామ సమీపంలోని ముళ్లపొదల్లోకి తీసుకెళ్లి చితకబాదారు. అంతటితో ఆగకుండా తమకు డబ్బు ఇస్తేనే వదులుతామని భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో బాధితుడు కుళాయప్ప చేసేదిలేక తన ఫోన్ పేలో ఉన్న మొత్తాన్ని బదిలీ చేసి అది చాలదు అని బెదిరించడంతో తమ బంధువులకు ఫోన్ చేసి వారి నుంచి నగదు వేయించుకొని వారికి బదిలీ చేశారు. రూ. 32,500 నగదు ఫోన్ వేయించుకున్నారు. ఆ తరువాత కుళాయప్పని వదిలేయడంతో బాధితుడు టూటౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. దీంతో నగదు పంపిన ఫోన్ పే నంబర్ల ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టి పై నలుగురిని అదుపులోకి తీసుకొని కొన్ని ఆధారాలతో అరెస్ట్ చేశామన్నారు. వీరి వద్ద నుంచి రూ. 33 వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు ఛేదించడంలో చొరవచూపిన సీఐలు జనార్దన్, రాజగోపాలనాయుడు, ఆంజినేయులు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

మహిళపై అత్యాచారం.. ఇద్దరు యువకుల అరెస్టు

లేపాక్షి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓ గ్రామంలో మహిళపై ఇద్దరు యువకులు ఆదివారం రాత్రి అత్యాచారం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితులు అశోక్, వెంకటేశ్‌ను అరెస్టు చేశామని ఎస్‌ఐ నరేంద్ర సోమవారం తెలిపారు. బాధిత మహిళకు కర్ణాటక ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. భర్తకు మతిస్థిమితం లేకపోవడంతో ఆమె పిల్లలతో కలిసి పుట్టింటికి చేరుకున్నారు. తల్లిదండ్రులు ఉంటున్న ఇంటి పక్కనే నివసిస్తున్నారు. పొరుగింటిలోని అశోక్ అనే యువకుడితో ఆమె చనువుగా ఉండేవారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి తన ముగ్గురు పిల్లలను తల్లి వద్దకు పంపి, అశోక్, అతని స్నేహితుడు వెంకటేష్‌తో కలిసి తన ఇంట్లో మద్యం సేవించింది. ఆ సమయంలో ఇద్దరూ తనపై అత్యాచారం చేశారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్‌ఐ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

టమోటా కిలో రూ. 12




అనంతపురం రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.12తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 275 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.10, కనిష్ఠ ధర రూ.7 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.24వేలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.24వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.4,500, సరాసరి రూ.14,250తో అమ్ముడుపోయినట్లు ఆయన తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 82 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

పట్టుచీరల నుంచి స్క్రాప్ వరకు...

అంతా జీరో..!



- అధికారులకు ప్రతినెలా రూ.40 లక్షలకుపైగా మామూళ్లు
- సంపాదనలో పోటీ పడుతున్న పన్నుల శాఖ అధికారులు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లాలోని హిందూపురం పట్టణంలో అంతా జీరో వ్యాపారమే నడుస్తోంది. ప్రభుత్వానికి వస్తుసేవలపన్ను(జీఎస్టీ) చెల్లించకుండా వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతున్నారు. పన్నుల శాఖ అధికారులు ప్రతి నెల రూ.40లక్షల వరకు తమ జేబుల్లోకి ముడుపులు వేసుకుంటూ, పన్ను వసూళ్లలో మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పట్టణంలో పట్టు చీరల నుంచి గుజిరీ సామాన్ల స్క్రాప్(తుక్కు)వరకు వ్యాపార లావాదేవీలు నడుస్తున్నాయి. ఇక్కడ ఓ ఉన్నతాధికారి, ముగ్గురు డీసీటీఓలు, సీనియర్ అసిస్టెంట్లు మూడు వర్గాలుగా ఏర్పడ్డారు. ఒకరు ఎక్కువ సంపాదిస్తున్నారని.. మరొకరికి మంటగా ఉంటున్నట్లు సమాచారం. దీంతో ఉన్నతాధికారులకు పరస్పరం ఫిర్యాదు చేసుకునే పరిస్థితి నెలకొంది. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో విచారణకు ఆదేశించారు.

ఒకే బిల్లు మీద ఐదారు వాహనాలు

హిందూపురం పరిధిలో అనేక ఫ్యాక్టరీలున్నాయి. వాటి స్క్రాప్(తుక్కు) నుంచి కడ్డీలు తయారు చేస్తారు. దీంతో ఆ తుక్కుకు కర్ణాటక రాష్ట్రంలో డిమాండ్ ఎక్కువ. ఇదంతా జీరో బిజినెస్సే. వాస్తవానికి వీటిపై 18శాతం జీఎస్టీ చెల్లించాలి. ఒకే బిల్లు మీద 5, 6 వాహనాలు తిరుగుతుంటాయట. అధికారులు మాత్రం నెల మామూళ్లతో ప్రశాంతంగా ఉంటున్నారు. ప్రతి నెలా అధికారులకు రూ.20లక్షల నుంచి రూ.25లక్షల వరకు ఆదాయం ఉంటున్నట్లు తెలిసింది.

పట్టుచీరల్లో బాగానే...

హిందూపురం పరిధిలో ముద్దిరెడ్డిపల్లి పట్టుచీరలకు కేంద్రం. అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు ప్రతి రోజూ 25వాహనాల వరకు తిరుగుతుంటాయట. పట్టుచీరలపై 5శాతం జీఎస్టీ చెల్లించాలి. చీరలు ఖరీదైనవి కావడంతో ఆదాయం బాగానే ఉంటున్నట్లు సమాచారం. ఇందుకు గాను అధికారులు ప్రత్యేక ఒప్పందం కుదుర్చుకున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రతి రోజు ప్రతి వాహనం నుంచి రూ.10వేలు ఇవ్వాల్సిందేనట. అలా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అధికారులు జేబులు నింపేసుకుంటున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

వక్కలు, డీజిల్, కిరాణం..

కర్ణాటక నుంచి వక్కలు బాగానే రవాణా అవుతుం టాం ు ు. వీటికి 18శాతం జీఎస్టీ చెల్లించాలి. ఇది కూడా జీరో బిజినెస్సే. కిలో రూ.400లు ప్రకారం విక్రయించే ఈ వక్కలు ఒక్కో వాహనంలో 16టన్నుల వరకు తీసుకెళ్తుంటారు. ఓ వాహనం నుంచి ఓ డీసీటీఓ ఒకే సారి రూ.12లక్షలు పుచ్చుకున్నట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న పై అధికారి మండిపోయారట. తనకు తెలియకుండా ఎక్కువ ఆదాయం పుచ్చుకోవడం ఆ అధికారికి ఇష్టం లేక అందరిపై మండిపడినట్లు తెలిసింది. ఇక డీజిల్ అక్రమంగా రవాణా జరుగుతున్నా రాజకీయ ప్రమేయం ఉండటంతో కిక్కురుమనకుండా ఉంటున్నారనే విమర్శలున్నాయి. కానీ పన్ను రూపంలో మాత్రం ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. ఇక కిరాణా, ఇతర చాలా వ్యవహారాల్లో నెలమామూళ్లు పుచ్చుకుంటున్నారని సమాచారం.

విచారణ పూర్తి... నివేదిక కమిషనర్‌కు..

పన్నుల శాఖ హిందూపురం సర్కిల్‌లో జరుగుతున్న అవినీతి పంచాయితీపై విచారణ పూర్తయింది. అక్కడ జరుగుతున్న వ్యవహారంపై నివేదిక పంపినట్లు సమాచారం. ఇప్పుడు ఆ నివేదికలో ఏముందనేది సర్వత్రా ఆసక్తికరంగా మారింది. గత కొన్ని రోజులుగా అధికారులు, సిబ్బంది చేసుకుంటున్న పరస్పర ఆరోపణల నేపథ్యంలో విషయం రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు చేరింది. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం అడిషనల్ కమిషనర్‌ను విచారణాధికారిగా నియమించారు. సోమవారం అడిషనల్ కమిషనర్ నాగేంద్ర, జాయింట్ కమిషనర్ శేషాద్రి, డిప్యూటీ కమిషనర్ మురళీకృష్ణలు సోమవారం హిందూపురం వెళ్లారు. జీఎస్టీకి సంబంధించిన రికార్డులు పరిశీలించినట్లు తెలిసింది. కొందరు డీలర్లతో విచారణ చేసినట్లు సమాచారం. సీటీఓ, డీసీటీఓ, ఏసీటీఓ, సీనియర్ అసిస్టెంట్లను ప్రత్యేకంగా విచారించినట్లు తెలిసింది. అనంతరం తుది నివేదికను ఆ శాఖ కమిషనర్‌కు పంపినట్లు సమాచారం.

జవాన్‌కు కన్నీటి వీడ్కోలు

అధికారలాంఛనాలతో అంత్యక్రియలు


లక్ష్మన్న పార్థివ దేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజలు

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గొలుసు దొంగను పట్టుకోబోయి.. ప్రమాదవశాత్తూ రైలు ఢీకొని మృతిచెందిన బీఎస్ఎఫ్ జవాన్ లక్ష్మన్నకు ఆయన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పట్టణవాసులు సోమవారం కన్నీటి వీడ్కోలు పలికారు. బీఎస్ఎఫ్ సిబ్బంది సైనిక విమానంలో ఆయన పార్థివ దేహాన్ని బెంగళూరుకు తీసుకువచ్చారు. అక్కడి ఆర్మీ క్యాంపు ఆఫీసులో సైనిక వందనం నిర్వహించి, రోడ్డు మార్గాన బ్రహ్మసముద్రానికి ఆదివారం రాత్రి తీసుకువచ్చారు. తహసీల్దార్ సుమతి, జడ్పీటీసీ ప్రభావతి, ఎంపీడీవో నందకిషోర్, టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి, పలువురు అధికారులు, నాయకులు సంతాపాన్ని తెలియజేశారు. మండల ప్రజలు తరలివచ్చి నివాళులు అర్పించారు. అనంతరం సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగేంద్ర కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


గాల్లోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు

ముదిగుబ్బ ఎంపీపీపై కేసు

- రియల్టర్‌పై దాడి చేసినందుకు..

పెనుకొండ రూరల్/అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్‌పై కియ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాజేష్ సోమవారం తెలిపారు. అమ్మవారిపల్లి సమీపంలో ప్రభాకర్ అనే రియల్ వ్యాపారి భూమిలో వెంచర్ వేస్తుండగా ఆదినారాయణ యాదవ్ తన అనుచరులతో ఆదివారం వెళ్లి దాడి చేశారని ఆయన తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆదినారాయణ యాదవ్, ఆయన అనుచరులు ఐదుగురిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని తెలిపారు. ఆదినారాయణ యాదవ్‌పై మూడునెలల క్రితం కూడా ఒక కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. కియ ఇండస్ట్రియల్ ఏరియాలో భూముల క్రయ విక్రయాలలో ఆదినారాయణ యాదవ్ మోసం చేశారని రైతులు అప్పట్లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ తెలిపారు. దీంతో ఆయనపై చీటింగ్ కేసు నమోదు చేశామని తెలిపారు.

అసత్య ప్రచారం: ఎంపీపీ

కియ సమీపంలో 250 ఎకరాల భూమిని కొనుగోలు చేశామని ఆదినారాయణ యాదవ్ అన్నారు. అందులో ప్రభాకర్, విష్ణువర్ధన్, తాను భాగస్వాములమని తెలిపారు. తన భూమిని కాజేయాలని వారు అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. అనంతపురంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన భూమిలో ప్రహరీ నిర్మిస్తున్నందుకు ప్రశ్నించానని, ప్రభాకర్ అనుచరులు తన అనుచరులపై దాడి చేశారని ఆరోపించారు. వారు భయపడి డయల్ 100కు ఫోన్ చేశారని, తాను సీఐకి ఫోన్ చేశానని అన్నారు. పోలీసులు తమ ఫిర్యాదును పక్కనపెట్టారని, తన భాగస్వాముల ఫిర్యాదును స్వీకరించి ఎఫ్ఐఆర్ చేస్తున్నామని చెప్పారని అన్నారు. వివాదంలో మంత్రి సత్యకుమార్‌కు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. న్యాయం చేయాలని పోలీసులను కోరుతున్నానని అన్నారు. ఎస్పీని కలిసి సమస్యను వివరిస్తానని అన్నారు.

యూనిక్ తంటాలు..!

డి-పట్టా రైతులకు కనిపించని ఆప్షన్
ఒకే సర్వే నంబరులో ఎక్కువ పేర్లున్నా అంతే..
నత్తనడకన సాగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియ


రిజిస్ట్రేషన్ వివరాలను పరిశీలిస్తున్న అనంతపురం ఏడీఏ రవి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అగ్రి స్టాక్‌లో (ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్) రైతుల వివరాల నమోదు ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. రైతులకు యూనిక్ నంబర్ కేటాయింపునకు ఆటంకం ఏర్పడుతోంది. ఈ నెల 7వతేదీ నుంచి జిల్లాలో రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆరంభమైంది. అయితే ఆశించిన స్థాయిలో రిజిస్ట్రేషన్ ముందుకు సాగడం లేదు. సాంకేతిక కారణాలు, మండలాల్లో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యమే దీనికి కారణమని అంటున్నారు. జిల్లాలో 4 లక్షల మందికిపైగా రైతులు ఉన్నారు. ఇప్పటి దాకా 32,027 మంది రైతుల వివరాలను రిజిస్ట్రేషన్ చేశారు. అత్యధికంగా గుంతకల్లు మండలంలో 2,994 మంది రైతులు వివరాలు నమోదు చేశారు. తాడిపత్రి 2,852, కణేకల్లు 2,534, పెద్దవడుగూరు 2,223, గుత్తి 2,049, యాడికి 1,901, విడపనకల్లు 1,800, పెద్దపప్పూరు 1,516, రాయదుర్గం 1,458, గార్లదిన్నె 1,303, పామిడి 989, గుమ్మగట్ట 962, బొమ్మనహాళ్ 832, నార్పల 820, కూడేరు 748, డి.హిరేహాళ్ 715, యల్లనూరు 677, అనంతపురం 529, బుక్కరాయసముద్రం 528, ఉరవకొండ 493, రాప్తాడు 475, బ్రహ్మసముద్రం 450, పుట్లూరు 443, కంబదూరు 419, ఆత్మకూరు 416, శింగనమల 413, బెలుగుప్ప 377, కల్యాణదుర్గం 324, శెట్టూరు 286, వజ్రకరూరు 266, కుందుర్పి 235 మంది రైతుల వివరాలను నమోదు చేశారు.



ఆన్‌లైన్‌లో అగ్రిస్టాక్ వెబ్ సైట్

లక్ష్యం సాధ్యమేనా..?

పీఎం కిసాన్ లబ్ధిదారుల్లో 30 శాతం మంది వివరాలను ఈ నెలాఖరులోగా నమోదు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం 2.79 లక్షల మంది పీఎం కిసాన్ లబ్ధిదారులున్నారు. వీరిలో 30 శాతం అంటే 83,700 మంది రైతుల వివరాల నమోదు పూర్తికావాలి. దీనికి మరో 10 రోజులే గడువు ఉంది. ఆలోగా లక్ష్యం సాధ్యమేనా అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. డి. పట్టా రైతుల వివరాలు నమోదు చేసే ఆప్షన్ ఇవ్వలేదు. దీంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఒకే సర్వే నంబర్‌తో ఒకటి కంటే ఎక్కువ మంది రైతుల వివరాలుంటే, ఆ రైతుల పేర్లు కనిపించడం లేదు. జిల్లాలో ఎక్కువ శాతం సర్వే నంబర్లకు రైతుల పేర్లు డిస్‌ప్లే కాకపోవంతో ఏం చేయాలో తెలియక ఆర్‌ఎస్‌కే సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం చూపలేదని సమాచారం.

మరింత వేగవంతం..

ఫార్మర్ రిజిస్ట్రేషన్ యూనిక్ నంబర్ రైతులందరికీ తప్పనిసరి. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తాం. డి. పట్టా భూములు, ఒకే సర్వే నంబర్‌తో పలువురు రైతుల పేర్లు ఉన్న వివరాల నమోదులో నెలకొన్న సాంకేతిక సమస్యలను రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. జిల్లాలో రైతులందరూ స్థానిక రైతు సేవా కేంద్రంలోని సిబ్బందిని సంప్రదించి యూనిక్ నంబర్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ నంబర్‌ను రైతులు తీసుకువెళ్లాలి. అధికారులు, సిబ్బందికి రైతులు సహకరించి ఈ ప్రక్రియ పూర్తయ్యేలా చొరవ చూపాలి.

-ఉమామహేశ్వరమ్మ,
జిల్లా వ్యవసాయ అధికారి

రిజిస్ట్రేషన్ ఇలా..

రైతులు తమ ఆధార్, పట్టాదారుల పుస్తకం, ఆధార్‌తో లింకైన సెల్ నంబర్‌ను రైతు సేవా కేంద్రాలకు తీసుకువెళ్లాలి. అక్కడి సిబ్బంది అగ్రిస్టాక్ వెబ్ సైట్‌లో రైతుల వివరాలతో రిజిస్ట్రేషన్ చేస్తారు. రైతు వివరాల నమోదులో భాగంగా తొలుత ఆధార్ వెరిఫికేషన్ కోసం ఒక ఓటీపీ వస్తుంది. ఆ తర్వాత మొబైల్ వెరిఫికేషన్ కోసం మరో ఓటీపీ వస్తుంది. ఆ తర్వాత ఈ సైన్ కోసం మరో ఓటీపీ అడుగుతుంది. మూడు ఓటీపీలు పూర్తైన తర్వాత రైతు రిజిస్ట్రేషన్ విజయవంతం అయినట్లు రైతు సెల్ నంబర్‌కు మరో సంక్షిప్త సమాచారం వెళుతుంది. ఆ మెసేజ్ వచ్చిన 48 గంటల తర్వాత 11 నంబర్లతో కూడిన యూనిక్ నంబర్ మెసెజ్ ద్వారా వస్తుంది.

వారాణసి వద్ద ప్రమాదం

- ఆగి ఉన్న బస్సును ఢీకొన్న లారీ
- కుంభమేళాకు వెళ్లిన తాడిపత్రివాసి మృతి
- మరో 11 మందికి గాయాలు


నాగలక్ష్మి (ఫైల్)

తాడిపత్రి, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన నాగలక్ష్మి (55) కుంభమేళాకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. తాడిపత్రి నుంచి సుమారు 40 మంది ప్రొద్దుటూరుకు చెందిన బస్సును మాట్లాడుకుని కుంభమేళాకు వెళ్లారు. త్రివేణి సంగమంలో స్నానం చేసి, పుణ్యక్షేత్రాలను చూసుకుని తిరుగుప్రయాణమయ్యారు. వారాణసి సమీపంలో శనివారం రోడ్డు పక్కన బస్సును ఆపి నిద్రించారు. ఆ తెల్లవారుజామున ఆగి ఉన్న బస్సును లారీ ఢీకొట్టింది. దీంతో బస్సులో నిద్రిస్తున్నవారు భయాందోళనకు లోనయ్యారు. బస్సు ధ్వంసమై.. పలువురు గాయపడ్డారు. కాసేపటి తరువాత స్థానిక పోలీసులు, అధికారులు అక్కడికి చేరుకుని బాధితులను ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడ్డవారిని హైదరాబాద్‌కు తరలించారు. మార్గ మధ్యంలో నాగలక్ష్మి (55) మృతిచెందారు. దీంతో ఆమె మృతదేహాన్ని నేరుగా తాడిపత్రికి తీసుకువచ్చామని భర్త రాజన్న తెలిపారు. గాయపడిన వారిలో అంజినమ్మ, బాలరంగయ్య, నాగలక్ష్మి, రామలక్ష్మమ్మ, అనసూయ, రమణ, లక్ష్మినారాయణ, సుబ్బలక్షుమ్మ తదితరులు 11 మంది ఉన్నారని తెలిపారు.

సమ్మెలోకి 'శ్రీరామిరెడ్డి' కార్మికులు

ఉమ్మడి జిల్లాలో 750 గ్రామాలకు కష్టాలు

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు సమ్మెలోకి వెళ్లారు. కళ్యాణదుర్గం పంపుహౌస్‌లో మోటార్లను సోమవారం రాత్రి 10.30 గంటలకు ఆఫ్ చేశారు. కళ్యాణదుర్గం, మడకశిర, హిందూపురం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల పరిధిలోని 750 గ్రామాలకు నీటి సరఫరాను నిలిపివేశారు. ఈ పథకంలో ప్రస్తుతం 630 మంది కార్మికులు, 20 మంది సూపర్‌వైజర్లు పనిచేస్తున్నారు. ఫేస్-1, 4 పరిధిలోని కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 292 మంది కార్మికులు ఉన్నారు. నెలకు రూ.16,200 ప్రకారం ఆరు నెలల వేతనం రూ.2,83,82,400 రావాల్సి ఉంది. 30 నెలల పీఎఫ్ రూ.2,10,24,000 రావాల్సి ఉంది. ఫేస్-2 పరిధిలో హిందూపురం నియోజకవర్గంలో 52 మంది కార్మికులకు నెలకు రూ.14 వేల ప్రకారం 10 నెలల వేతనం రూ.72.80 లక్షలు, 10 నెలల పీఎఫ్ రూ.6.39 లక్షలు, పరిగి పరిధిలో 14 మందికి 30 నెలల పీఎఫ్ రూ.5,16,600 రావాల్సి ఉంది. ఫేస్-3 పరిధిలో మడకశిర నియోజకవర్గంలో 172 మంది కార్మికులు పనిచేస్తున్నారు. నెలకు రూ.14 వేలు ప్రకారం ఐదు నెలలకు రూ.12.40 కోట్లు, రూ.2,400 ప్రకారం పీఎఫ్ 10 నెలలకు రూ.41.28 లక్షలు రావాల్సి ఉంది. బకాయిలు చెల్లించేదాకా సమ్మెను విరమించేది లేదని కార్మికులు స్పష్టం చేశారు.

రాయల భాషా సేవ అజరామరం: వీసీ


కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ అనిత

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కన్నడ రాజైనా శ్రీకృష్ణదేవరాయలు తెలుగుభాషకు చేసిన సేవ అజరామరమని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత పేర్కొన్నారు. ఎస్కేయూలోని భువజన విజయం ఆడిటోరియంలో సోమవారం శ్రీకృష్ణదేవ రాయల జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. వ్యవసాయ రంగ అభివృద్ధితోనే ఆర్థిక స్థితిగతులు మారుతాయని భావించిన శ్రీకృష్ణదేవ రాయలు అనేక చెరువులను తవ్వించాడన్నారు. భాష, సాంస్కృతిక, సంప్రదాయాలకు పెద్దపీట వేశారని కొనియాడారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. తెలుగుశాఖ ప్రొఫెసర్ నరసింహన్ అధ్యక్షతన నిర్వహించిన వేడుకలకు ప్రొఫెసర్ తిప్పేస్వామి, కన్వీనర్ రామిరెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది హాజరయ్యారు.

తహసీల్దార్ కార్యాలయానికే డ్రైవర్..!

- అధికారి పేరుతో బెదిరింపులు
- డబ్బు ఇవ్వలేదని మామిడిచెట్ల తొలగింపు
- పురుగుల మందుతో వచ్చిన రైతు
- అడ్డుకున్న పోలీసులు



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న బాధితులు, డ్రైవర్‌పై దాడికి యత్నిస్తున్న బాధితులు

బత్తలపల్లి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి అధికారి పేరు చెప్పి రైతులను వేధించడం వివాదాస్పదమయింది. ఆయన కారు డ్రైవింగ్‌తో పాటు అధికారి పేరు చెప్పి చక్రం తిప్పుతున్నాడని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం పలువురు రైతులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చి డ్రైవర్ బాగోతంపై ఆందోళనకు దిగారు. ఓ రైతు ఏకంగా పురుగు మందు డబ్బాతో వచ్చి ఆ డ్రైవర్ వేధింపులు తాళలేకపోతున్నానని వాపోయారు. వివరాల్లోకి వెళితే.. బత్తలపల్లి తహసీల్దార్ స్వర్ణలత వద్ద విధులు నిర్వహిస్తున్న ప్రైవేటు డ్రైవర్ బాషా ప్రతి పనిలోనూ జోక్యం చేసుకుంటున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని ఉప్పర్లపల్లికి చెందిన టీడీపీ కార్యకర్తలు వసికేరప్ప, కాటమయ్యకు సర్వే నెంబరు 4, 2వ లెటర్‌లో 4 ఎకరాల పొలం ఉంది. అందులో మామిడి చెట్లు పెంచుతున్నారు. అందులో అధికారికంగా స్కెచ్ మేరకు దారిలేదు. వైసీపీ నాయకుడి పొలానికి వెళ్లేందుకు ప్రస్తుతం జరుగుతున్న రీసర్వేలో దారి ఉన్నట్లు చూపారు. నాలుగు రోజుల క్రితం మండల సర్వేయర్, తహసీల్దార్ కారు డ్రైవర్ వెళ్లారు. ఈ పొలంలో దారి ఉందని ఎలాంటి నోటీసు ఇవ్వకుండా మామిడి చెట్లను విలేజ్ సర్వేయర్ రవి, డ్రైవర్ బాష, వీఆర్‌ఏ రామాంజి వైసీపీ నాయకుల ముందే తొలగించారు. అడ్డుకోబోయిన రైతులను బెదిరించి 18 చెట్లను తొలగించారు. ఈ నేపథ్యంలో బాధిత రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి బంధువులతో కలసి వచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సోమశేఖర్ అక్కడికి చేరుకున్నారు. తనిఖీ చేయగా బాధిత రైతు జేబులో పురుగుల మందు డబ్బాను గుర్తించి స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారి బంధువులు డ్రైవర్‌పై దాడికి యత్నించారు. అక్కడే ఉన్న వీఆర్వోలు వారి నుంచి డ్రైవర్‌ను తప్పించారు. ఈ సందర్భంగా బాధిత రైతుల తల్లి శివమ్మ తహసీల్దార్ ముందు మాట్లాడుతూ.. మీ డ్రైవర్ రెండు లక్షలు ఇస్తే మీ పొలం ఉంటుంది.. లేదంటే వారికి దారి వదలాల్సిందే అని బెదిరించాడని వాపోయారు. రెక్కాడితే కానీ డొక్కాడని మాపైనా మీరు పడి పీక్కుతినేది అంటూ బోరున విలపించారు.

● అన్నీ తానైన డ్రైవర్..

తహసీల్దార్ కారు డ్రైవర్ బాషా కార్యాలయంలో అన్నీ తానై వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. రైతులు తమ పొలాలకు సంబంధించిన మ్యుటేషన్ చేసుకునేందుకు వచ్చే వారి నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాగే బత్తలపల్లికి చెందిన ఓ రైతు నుంచి మ్యుటేషన్ కోసం రూ. 2 లక్షలు డిమాండ్ చేశాడు. దంపెట్ల గ్రామంలో గత ప్రభుత్వంలో నకిలీ పట్టాలు ఇచ్చారు. వాటిని ఒరిజినల్ పట్టాలుగా మార్చేందుకు ఒక్కొక్కరి నుంచి రూ. 20వేలు వసూలు చేశాడని బాధితులు చెబుతున్నారు. డి.చెర్లోపల్లిలో ఓ ప్రభుత్వ ఉద్యోగి ఐదు ఎకరాల డి.పట్టా భూమి కొన్నాడు. దానిని అతడి పేరు మీద మార్చుకునేందుకు రూ. 6 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. నల్లబోయినపల్లికి చెందిన ఓ దళితుడి భూమి ఫ్రీహోల్డ్‌లో అమ్మేందుకు అర్హత పొందాడు. ఆ భూమిని వైసీపీ నాయకుడు కొన్నాడు. విషయం తెలుసుకున్న డ్రైవర్ రంగప్రవేశం చేసి ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు ఉన్నతాధికారుల పేరు చెప్పి రూ.11లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. ఓబుళాపురం, డి.చెర్లోపల్లి, ముష్టూరు పంచాయతీలలో గతంలో పని చేసిన వీ ఆర్వోలతో కలసి ఇంటి పట్టాలు ఇచ్చిన వారిని బెదిరించి డబ్బులు వసూలు చేశాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జగన్ అన్న లేఅవుట్లలో పట్టాలు ఇప్పిస్తానని చాలా మంది నుంచి డబ్బులు వసూలు చేశాడనే విమర్శలు ఉన్నాయి. ఇసుక అక్రమ రవాణాదారుల నుంచి కూడా అధికారి పేరు చెప్పి నెలరోజుల క్రితం రూ.80 వేలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కార్యాలయంలో ఏ పని కావాలన్నా డ్రైవర్‌ను కలిస్తే చాలు.. నిమిషాల్లో జరిగిపోతుంది అనేలా వ్యవహారాలు నడుపుతున్నాడని తెలుస్తోంది. ఈ విషయంపై తహసీల్దార్ స్వర్ణలత మాట్లాడుతూ.. తనపేరు చెప్పి ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. తన పేరు చెప్పి అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని, ఆధారాలతో సహా ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటానని వివరణ ఇచ్చారు.

న్యూస్ బాక్స్

అడవులకు నిప్పుపెడితే జైలుకే: ఎస్పీ

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అడవులకు నిప్పుపెడితే జైలు శిక్ష తప్పదని ఎస్పీ వీరత్న సోమవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవల జిల్లావ్యాప్తంగా పలుచోట్ల కొందరు ఆకతాయిలు, గొర్రెల కాపరులు కొండలకు, అడవులకు నిప్పుపెట్టడం దారుణమన్నారు. వీరి చేష్టల వల్ల దట్టమైన అడవులు అంతరించిపోతున్నాయన్నారు. లక్షలాది వన్యప్రాణులు ఆహుతై పోతున్నాయన్నారు. ఫలితంగా పర్యావరణం సమతుల్యం దెబ్బతింటుందన్నారు. అలా నిప్పు పెట్టిన వారి ఆచూకి తెలిపాలని ఎస్పీ కోరారు.

పగటిపూటే కరెంటు ఇవ్వాలి

గాండ్లపెంట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వ్యవసాయానికి ఇస్తున్న తొమ్మిది గంటల కరెంట్‌ను పగటి పూట ఇవ్వాలని మండలంలోని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రైతులు ఎల్ఐ నరసింహులు వినతిపత్రం అందించారు. పగటిపూట నాలుగు గంటలు, రాత్రి సమయం ఐదు గంటలు కరెంటు ఇస్తున్నారని, రాత్రి సమయంలో నీటిని అందించాలంటే ఇబ్బందిగా ఉందని వాపోయారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు రాజారెడ్డి, మాజీ సర్పంచ్ కాకార్ల రవీంద్రారెడ్డి, బాబాసాబ్, కొండారెడ్డి, ఆంజనేయులు, ఈశ్వరరెడ్డి, ఆజీమ్‌సాబ్ పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ గుర్తింపు కార్డు ఇవ్వాలి

కొత్తచెరువు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకూ గుర్తింపు కార్డు అందేలా చొరవ చూపాలని వ్యవసాయ అధికారి నటరాజ్ సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ బాలాంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన వీఆర్వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు గుర్తింపు కార్డు మంజూరు చేయడం వల్ల వారికి అందే ప్రభుత్వ పథకాలు పక్కదారి పట్టకుండా ఉంటాయన్నారు.

నిధులు మంజూరు చేయండి

బుక్కపట్నం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): బుక్కపట్నంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డిని ఆ కళాశాల ప్రిన్సిపల్ మగ్బుల్ హుస్సేన్, టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం పుట్టపర్తి క్యాంపు కార్యాలయంలో పల్లెకు వినతిపత్రం అందించారు. అలాగే మండల కేంద్రంలో సాగునీటి కాలువల ఊట నీటికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. వారి వెంట సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు దేశెట్టి సంజీవరాయుడు, టీడీపీ సీనియర్ నాయకుడు చెన్నక్రిష్ణ ఉన్నారు.

'ప్రైవేటు మెడికల్ ల్యాబ్' జిల్లా కమిటీ ఏకగ్రీవం



అధ్యక్షుడు శెట్టిపి సూర్యప్రకాశ్ రెడ్డి

ధర్మవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ జిల్లా సంఘాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. సోమవారం పుట్టపర్తిలో జరిగిన సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్స్ సురేంద్రరెడ్డి, ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యం లో జిల్లా కమిటీని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా ధర్మవరం పట్టణానికి చెందిన శెట్టిపి సూర్యప్రకాశ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా హిందూపురం పట్టణానికి చెందిన ముక్తి యార్, జనరల్ సెక్రటరీగా రామ్మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కదిరికి చెందిన వినోద్, అడ్వైజర్ కమిటీ సభ్యుడిగా మల్లికార్జునను ఎంపికచేశారు.

నేడు మహిళా సదస్సు

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా ఎస్పీ వీ రత్న ఆధ్వర్యంలో జిల్లా పోలీసుశాఖ మహిళా సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా పోలీసు కార్యాలయం సోమవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఇందులో మహిళల భద్రత- భవిష్యత్తుకు భరోసా అనే అంశంపై చర్చిస్తారని, ఉదయం 10-30 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎస్పీతో పాటు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఆర్డీఓ సువర్ణ, డీఎస్పీ విజయ్‌కుమార్, పలువురు అధికారులు పాల్గొంటారని వివరించింది.

భూకబ్జాలపై దర్యాప్తు చేపట్టాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకుడు డైమండ్ ఇర్ఫాన్

కదిరి/అర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): భూకబ్జాలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, పేదలకు న్యాయం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్‌కు టీడీపీ పట్టణాధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ కోరారు. సోమవారం స్థానికంగా నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందచేశారు. వైసీపీ పాలనలో రెవెన్యూ అధికారుల సాయంతో చాలు కబ్జాలకు పాల్పడ్డారన్నారు. వాటిపై పూర్తిస్థాయి లో దర్యాప్తు చేసి, కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

● ఇనుప స్తంభాలు తొలగించండి : పట్టణంలోని పాత మున్సిపల్ హైస్కూల్ వద్ద శ్రీఖాద్రీల క్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లే దారిలో ఏర్పాటుచేసిన ఇనుప స్తంభాలను తొలగించాలని స్థానికులు కలెక్టర్ కు వినతిపత్రం అందచేశారు.

● శ్మశానవాటికను కాపాడండి: పట్టణంలోని హిందూపురం రోడ్డు నామా కాంపౌండ్ పక్కనున్న మరాఠి కులస్థులు శ్మశాన వాటికను కొందరు కబ్జా చేయడానికి యత్నిస్తున్నారని, దాన్ని అడ్డుకోవాలని మరాఠి కులస్థులు కోరారు.

● అవుట్‌సోర్సింగ్ సమస్యలు పరిష్కరించాలి: బీసీ హస్టల్‌లో పని చేస్తునన అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు.. కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. మినిమం టైమ్‌స్కేల్ అమలు చేయాలని, సమాన పనికి సమావేతనం ఇవ్వాలని, ఆప్కాస్ విధానం కొనసాగించాలని కోరారు.

● ఉపాధి పనులు చేపట్టాలి: గ్రామాల్లో ఉపాధి హామీపనులు వెంటనే చేపట్టాలని వ్యవసాయ కార్మికసంఘం నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. జిల్లాలో రైతులు, కూలీలు, వ్యవసాయ కార్మికులు ఉపాధి పనులు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారన్నారు.

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా శ్రీనివాసులు

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా అడ్వొకేట్ నిడిమామిడి శ్రీనివాసులును నియమించారు. ఈమేరకు సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి ఆయనకు నియామకపత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద, అర్బన్ టీడీపీ కన్వీనర్ రామాంజనేయులు, టీడీపీ నాయకులు మహమ్మద్ రఫీ, రమేష్ పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలపరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నామని, ఇందులో స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పాల్గొంటారని ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సర్పంచులు, మండల కోఆప్షన్ సభ్యులు హాజరుకావాలని, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పూర్తి నివేదికలతో రావాలని సూచించారు.

పక్షుల లెక్కింపు

నంబులపూలకుంట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెడబల్లి డ్యామ్, ఎగువతూపల్లి, పాపాన్నగారిపల్లి, సారగుండ్లపల్లి, నాగంవారిపల్లి తదితర ప్రాంతాల్లో పక్షుల గుర్తింపు, లెక్కింపు కార్యక్రమాన్ని జిల్లా అటవీశాఖాధికారి చక్రపాణి ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ఏటా ఈనెల 14 నుంచి 17వరకు పక్షుల లెక్కింపు చేపడతామన్నారు. కొండలకు నిప్పుపెట్టడం వల్ల పక్షులు, వన్యప్రాణాలు అంతరించిపోతున్నాయని, ఎవరూ కొండలకు నిప్పు పెట్టకూడదని హెచ్చరించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భక్తర్‌వలీ, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాఘమాస పూజలు



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ధర్మవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక చక్రవర్తి థియేటర్ సమీపంలో కాలభైరవ స్వామి ఆలయంలో మాఘమాసం మూడో సోమవారం సందర్భంగా అర్చకుడు ధనంజయ ఆచారీ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవమూర్తికి భక్తులతో అభిషేకాలు చేయించారు. ప్రదోష గడియల్లో దీపోత్సవాన్ని నిర్వహించారు. పట్టణ ప్రాంతవాసులే కాకుండా చుట్టు పక్కల గ్రామాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేయించారు.

రేషన్ దుకాణం సీజ్

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని డబురవారిలపల్లి చౌకధాన్యపు నెంబరు 22ను సోమవారం సీజ్ చేసినట్లు సీఎస్ డీటీ విజయనిర్మల తెలిపారు. సరిగా బియ్యం ఇవ్వడంలేదని లబ్ధిదారులు ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టామన్నారు. బియ్యం సరిగా ఇవ్వడం లేదని తేలిందన్నారు. దీంతో డిపోను సీజ్ చేశామన్నారు.

నాటుసారా స్వాధీనం

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగురుమాను తండాలో 20 లీటర్ల నాటుసారా సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ నీరంజన్‌రెడ్డి తెలిపారు. వ్యక్తిని అరెస్ట్ చేశామని చెప్పారు.

ప్రజాఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు



ముదిగుబ్బ: నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని డీఆర్ఓ విజయసారథి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌సెల్‌లో ప్రజల నుంచి ఆయన 123 అర్జీలు స్వీకరించారు.

● ధర్మవరం : ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో ఆర్డీఓ మహేశ్ 15 ఫిర్యాదు స్వీకరించారు. వీటిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. అదేవిధంగా మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రెండు ఫిర్యాదులు వచ్చాయని కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు.

● ముదిగుబ్బ: మండలంలో చుక్కల భూముల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేశారు. సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ.. మండలంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉండటంతో ఏడేళ్లుగా ఆ భూములు రిజిస్ట్రేషన్‌కు నోచుకోకపోవడంతో సంబంధిత రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు.

ఉరుసు మహోత్సవాలు ప్రారంభం

కొత్తచెరువు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మస్తాన్‌వలి ఉరుసు మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. రాత్రి గంధం పూజ, చాదర్ గలఫ్ కార్యక్రమాన్ని ముస్లింలు, మత పెద్దలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, కూటమి నాయకులు పెద్ద ఎత్తున హాజరై ప్రార్థనలు చేశారు. బుధవారం రాత్రి 9గంటలకు జియారత్ కార్యక్రమంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి.

ఫ్రీహోల్డ్ చేయడానికి లంచం ఇవ్వలేను

ఆర్డీఓ కార్యాలయం ఎదుట రైతు ధర్నా



ధర్నా చేస్తున్న రైతు తొండమాల రవి

ధర్మవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తన భూమిని ఫ్రీహోల్డ్ చేయడానికి అధికారులు డబ్బులు అడుగుతున్నారని, తాను లంచం ఇచ్చుకోలేనని రైతు తొండమాల రవి ఆర్డీఓ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నాకు దిగారు. ఆయన మాట్లాడుతూ... '1978లో చెన్నేకొత్తపల్లి మండలం ప్యాధిండి పొలంలో నా తండ్రి వీరన్న పేరిట 4.58 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. 2003కు ముందున్న భూములు 2023లో ఫ్రీహోల్డ్ అయ్యాయి. మా భూమి కలెక్టర్ జాబితాలో సీరియల్ నెంబర్ 592 ఉంది. ఆ తరువాత ప్యాధిండి వీఆర్వో చంద్రశేఖర్ వద్దకు వెళ్లితే ఫ్రీహోల్డ్ చేయాలంటే ప్రాసస్ చాలా ఉందంటూ రూ.10 వేలు డబ్బులు తీసుకున్నాడు. ఎన్నికలకు నెల రోజుల ముందు వెళ్లి అడిగితే ఇంకా రూ.1.90 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. నా భూమికి సంబంధించి రికార్డులన్నీ నా వద్ద ఉన్నాయని, నా భూమిని ఫ్రీహోల్డ్ చేయాలని కోరాను. అంతలో ఎన్నికలు రావడంతో ఆ పనులకు బ్రేక్ పడింది. ఇటీవల భూములను రీ సర్వే చేస్తున్నారని తెలిసి మళ్లీ వీఆర్వోని అడిగితే పట్టించుకోవడం లేదు. విషయాన్ని ఆర్డీఓ, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాను. వీఆర్వో చంద్రశేఖర్ బదిలీపై వెళ్లారన్నారు. ప్రస్తుత రెవెన్యూ అధికారులను అడిగితే ఫస్ట్ లిస్టులో లేదు.. రెండో లిస్టులో వస్తే చేస్తామని చెబుతున్నారు. ఎంతకాలం ఇలా ఆఫీసుల చుట్టూ తిరగాలి. అన్ని రికార్డులూ పక్కాగా ఉన్నా.. నా భూములను ఎందుకు ఫ్రీహోల్డ్ చేయడం లేదో అర్థం కావడం లేదు. అందుకు విసుగువచ్చి ఇలా ధర్నా చేస్తున్నా.. ఇప్పటికైనా నాకు న్యాయం జరగకపోతే కలెక్టర్ వద్దకు వెళ్తా' అని చెప్పాడు. ఆర్డీఓ మహేష్ ఆయనతో మాట్లాడుతూ.. మూడు రోజుల్లో విచారించి న్యాయంచేస్తామని హామీ ఇవ్వడంతో రైతు ఆందోళన విరమించాడు.

క్రైం న్యూస్..

బంగారు గొలుసు చోరీ



బాధితురాలు ఇందిరమ్మ

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అమడగూరు మండలం కుమ్మరిండ్లలో పట్టపగలు వృద్ధురాలి మెడలోని తులం బంగారు గొలుసును ఇద్దరు దుండగులు ఎత్తుకెళ్లారు. కుమ్మరిండ్లలో వృద్ధురాలు ఇందిరమ్మ చిల్లర దుకాణం నిర్వహిస్తోంది. సోమవారం ఉదయం 8.30 గంటల సమయంలో నెంబర్ ప్లేటులేని గ్లామర్ ద్విచక్రవాహనంపై ఇద్దరు యువకులు ఈ దుకాణం వద్దకు వచ్చారు. ఒకరు బండిని ఆన్ చేసుకుని ఉండగా, మరో వ్యక్తి ఇందిరమ్మ వద్దకు వచ్చి.. లీటర్ పెట్రోల్ ఇవ్వాలని అడిగాడు. ఆమె పెట్రోల్ ఇస్తుండగా.. ఆమె మెడలోని బంగారు గొలుసుకొని లాక్కొని.. బైక్‌పై తనకల్లు వైపు వెళ్లిపోయారు. ఇందిరమ్మ కేకలు వేసినా.. ఫలితం లేకుండా పోయింది. అమడగూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బోర్ల కేబుల్ చోరీ

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బిల్వం పల్లి గ్రామంలో దొంగలు ఆదివారం అర్ధరాత్రి హల్‌చల్ చేశారు. గ్రామసమీపాన రహదారికి ఆనుకోని ఉన్న పంచాయతీ బోరుతో పాటు రైతులు ఓబిలేసు, బాలనారాయణస్వామి, బాలిరెడ్డి, తిమ్మిగాని సురేంద్ర, దాసరికేశవ, బిల్లునరసప్ప, దాసరి రామ్మోహన్, దాసరిబయన్న మరో ఇద్దరి పొలాల్లో బోర్లకు స్టార్టర్ పెట్టి నుంచి వెళ్లే కేబుల్‌వైరు కట్ చేసి ఎత్తుకెళ్లారు. దీంతో రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోయారు. దీనిపై రూరల్ పోలీసులకు, ఎంపీడీఓ కు ఫిర్యాదు చేశారు.

వ్యక్తిపై దాడి

ధర్మవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ యార్డ్ సమీపంలో నివాసముంటున్న మధుసూదన్‌నాయుడుపై ఎరికల రాజ, మరికొందరు సోమవారం దాడి చేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. మధుసూదన్‌నాయుడు, ఎరికల రాజ మధ్య ఆర్థిక వ్యవహారాల కారణంగా గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో ఎరికలరాజు, మరికొందరు శారదానగర్‌లోని డాబా వద్ద మధుసూదన్‌నాయుడిపై దాడి చేశారు. గాయపడిన మధుసూదన్ నాయుడిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు ఆస్పత్రికి వెళ్లి సంఘటనపై ఆరా తీశారు. మధుసూదన్ నాయుడి ఫిర్యాదు మేరకు ఎరికల రాజ, మరికొందరిపై కేసు నమోదు చేశారు.

యువకుల ఘర్షణ

కొత్తచెరువు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలమర్ల గ్రామానికి చెందిన చరణ్, బాబు గత కొంతకాలంగా పావులు పెంచుతూ పందెం ఆడేవారు. వారి మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగేవి. ఈ లావాదేవీలలో మనస్పర్థలు రావడంతో ఇరువురి మధ్య విభేదాలు తలెత్తాయి. ఈ క్రమంలో చరణ్ తండ్రి కేశవ, బాబు తండ్రి ఫకృద్దీన్ సోమవారం మాటామాటా పెరిగి దాడి చేసుకున్నారు. ఈ దాడిలో ఫకృద్దీన్ తలకు గాయమైంది. ఫకృద్దీన్, కేశవ ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు.

కంది పంటకు నిప్పు

ముదిగుబ్బ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు తన కంది పంటకు సోమవారం నిప్పు పెట్టారని, దీంతో దాదాపు రూ. 1.50 లక్ష దాకా నష్టం వాటిల్లిందని మండలంలోని సిరిగారిపల్లికు చెందిన రైతు నరసయ్య శాస్త్రి వాపోయారు. 10 ఎకరాల్లో కంది పంట సాగు చేశానని, ఆరు ఎకరాల్లోని పంట కాలిపోయిందని, గ్రామస్థుల సాయంతో నాలుగు ఎకరాల్లోని పంటను కాపాడుకోగలిగానని అన్నారు. దీనిపై పట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ మండల కన్వీనర్ కరణం ప్రభాకర్, కోట్ల బాబి, టీడీపీ నాయకులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

డబుల్ రిజిస్ట్రేషన్‌పై ఫిర్యాదు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఒకే భూమిని ఏడాది వ్యవధిలో అనంతపురానికి చెందిన ఓ మహిళ ఇద్దరికి రిజిస్ట్రేషన్ చేయించిందని బాధితుడు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీ ఆర్ఎస్)లో ఫిర్యాదు చేశాడు. పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని చంద్రబాబు నగర్‌కు చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డి ఈ ఫిర్యాదు చేశాడు. వారం రోజుల క్రితం ఈసీ తీశానన్నారు. తనకు భూమి విక్రయించిన నగరానికి చెందిన ఓ మహిళ, ఆ భూమిని ఆమె పెద్దకుమారుడికి అమ్మినట్లు అందులో తేలిందన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ శాఖలో డీఐజీ, డీఆర్‌లకు ఫిర్యాదు చేశానని అతడు తెలిపాడు.

మెప్మా టీఎంసీ వెంకటేశ్ సస్పెన్షన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ధర్మవరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం మున్సిపాలిటీలో మెప్మా విభాగంలో పనిచేస్తున్న టీఎంసీ వెంకటేశ్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు మెప్మా పీడీ విశ్వజ్యోతి సోమ వారం తెలిపారు. వెంకటేశ్ నకిలీ మహిళా సంఘాలకు బ్యాంకులలో రుణాలు ఇప్పించి అవినీతికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి మెప్మాలో అడుగడుగునా అవినీతిమయం అన్నశీర్షికన తో గత ఏడాది డిసెంబరు 10న ప్రచురించింది. దీంతో మెప్మా ఉన్నతాధికారులు విచారణ చేపట్టి వెంకటేశ్‌ను సస్పెండ్ చేశారు. ఈ ఉత్తర్వులను ధర్మవరం మున్సిపల్ కార్యాలయానికి పంపినట్లు పీడీ తెలిపారు.

అదుపు తప్పిన కారు

గాండ్లపెంట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులవారిపల్లి వద్ద కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని, ప్రహరీని సోమవారం ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. అనంతపురం నుంచి రాయచోటికి కారులో నలుగురు బయలుదేరారు. గాజువారిపల్లి వద్ద రోడ్డు మరమ్మతుల కోసం కంకర వేశారు. కారు ఆ కంకరలో అదుపు తప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని, ప్రహరీని ఢీకొంది. విద్యుత్ స్తంభం విరిగి కారుపై పడింది. విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లైంది.

సమస్యలపై అంగన్‌వాడీల ఆందోళన

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తమ వేతనాలు పెంచి, గ్రాట్యూటీ అమలు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం వినతపత్రాన్ని సీడీఓ రాధికకు అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాబ్‌జాన్, ముస్తాక్, అంగన్‌వాడీ నాయకురాలు మాబూన్నీషా పాల్గొన్నారు.

● ధర్మవరం: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీఓ మహేశ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఇందులో సీఐటీయూ మండల కన్వీనర్ జేవీరమణ, నాయకులు ఎస్‌హెచ్‌బాషా, అయూబ్‌ఖాన్, ఎల్ ఆదినారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు: మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్‌లోని సీడీపీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ఆందోళన చేపట్టారు. ఇందులో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీఎల్ నరసింహులు, జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు సున్నంపల్లి రమణ, రంగమ్మ, యూనియన్ లీడర్లు పాల్గొన్నారు.

● బత్తలపల్లి: స్థానిక సీడీపీఓ కార్యాలయం వద్ద తాడిమర్రి, బత్తలపల్లి, ముదిగుబ్బ మండలాలకు చెందిన అంగన్‌వాడీలు నిరసన చేపట్టారు. కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం ఇచ్చారు.



కదిరి : సీడీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

సజావుగా ఇంటర్వ్యూలు

నల్లమాడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లోని ఎంపీడీఓ కార్యాల యంలో సోమవారం బీసీ సబ్సిడీ రుణాల కు ఎంపీడీఓ ఆజాద్ ఆధ్వర్యంలో సజావుగా ఇంటర్వ్యూలు సాగాయి. మంగళవారం దొన్నికోట, కురలమాల, మలసకవం పల్లి, నల్లమాడ, గోపేపల్లి, పెమన కుంటపల్లి తండా, పులగంపల్లి పంచాయతీల్లో దరఖాస్తు దారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.

● నేడు, రేపు ఇంటర్వ్యూలు

పుట్టపర్తిరూరల్ : మండలానికి సంబంధించిన సబ్సిడీ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మంగళ, బుధవారాల్లో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి సోమవారం ఓప్రకటనలో పేర్కొన్నారు.

● గాండ్లపెంట : సబ్సిడీ రుణాలకు దరఖాస్తుకున్న లబ్ధిదారులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి సోమవారం ఓప్రకటలో తెలిపారు.

● తనకల్లు : మండల కేంద్రంలోని ఏపీజీవీ బ్యాంక్ పరిధిలోని బీసీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలను ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

ఆస్పత్రి తనిఖీ

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక రాజీవ్‌గాంధీ నగర్‌లోని యూపీహెచ్‌సీని ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ నివేదిత సోమ వారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. మశానంపేటలోని మున్సిపల్ పాఠశాలలో ఆల్బెండోజల్ మాత్రలు పంపిణీ పరిశీ లించారు. ఆమె వెంట డాక్టర్ లిఖిత్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు ఉన్నారు.

న్యూస్ బాక్స్

పేదలకు మూడు సెంట్ల స్థలం ఇవ్వాలి



పట్టాలను చూపుతున్న సీపీఐ నాయకులు

చిలమత్తూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేదలకు మూడు సెంట్ల ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యామాదవ్ డిమాండ్ చేశారు. మండలంలో పేదల ఇంటి స్థలాలకు దరఖాస్తుల నమోదు కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఇంటి స్థలాల పేరుతో కేవలం ఒక సెంటు స్థలం మాత్రమే ఇచ్చిందని, దాంతో పేదలు సౌకర్యవంతంగా ఇంటి నిర్మాణాలు చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. అలాంటి పొరపాటు ఇప్పుడు జరగకుండా కూటమి ప్రభుత్వం పేదలపై ప్రత్యేక దృష్టి పెట్టి పట్టణాల్లో పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలం ఇవ్వాలని కోరారు. నాయకులు కాటమయ్య, వినోద్, చంద్రశేఖర్ రెడ్డి, బాలచంద్ర, నాగిరెడ్డి పాల్గొన్నారు.

శివస్వాములకు అన్నదానం


శివస్వాములకు భోజనం వడ్డిస్తున్న దాతలు

సోమందేపల్లి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివానగర్ అయ్యప్ప స్వామి ఆలయంలో న్యాయవాది భాస్కర్‌రెడ్డి, మాస్టర్ వీవర్స్ అశోక్ సోమవారం శివస్వాములకు అన్నదానం చేశారు. మొదట అయ్యప్ప స్వామికి దీపారాధన, ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

మహాసింహగర్జనను విజయవంతం చేయండి


పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

పెనుకొండ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వర్గీకరణకు వ్యతిరేకంగా 23వ తేదీన కర్నూలు జిల్లాలో మాలలతో నిర్వహిస్తున్న మహాసింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు మూర్తి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మాలల డెటికేట్ సమావేశం నిర్వహించారు. కర్నూలు మహాగర్జనపై నాయకులు చర్చించారు. వర్గీకరణపై సుప్రీం కోర్టు ఎలాంటి సూచన ఇవ్వలేదన్నారు. రాష్ట్రాలకు ఇష్టమైతే వర్గీకరణ చేసుకోవచ్చని తెలిపిందే తప్ప చెయాలని తీర్పు ఇవ్వలేదన్నారు. అనంతరం పోస్టర్లు విడుదల చేశారు. నాయకులు పాండురంగమూర్తి, సోమకుమార్, ఈశ్వరయ్య, గంగులయ్య, సోమన్న, గోవిందు, నాగేంద్ర, శేషాద్రి పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు


శిక్షణ తరగతుల గదిని పరిశీలిస్తున్న అధికారులు

పరిగి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగనవాడీ వర్కర్లకు మంగళవారం నుంచి 25వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత సోమవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జ్ఞానజ్యోతి 125 రోజుల శిక్షణలో భాగంగా 18, 19, 20 తేదీలలో సేవామందిరం ఉన్నత పాఠశాలలో తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 22,24,25 తేదీల్లో కూడా తరగతులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 లక్ష్మీదేవి, ఎంఈఓ-2 శేషాచలం పాల్గొన్నారు.

విజయభేరి సభను జయప్రదం చేయండి

గోరంట్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జీనవాండ్లపల్లి కమ్యూనిటీ భవనం వద్ద మంగళవారం నిర్వహించే నాయీబ్రాహ్మణ విజయభేరి సభను జయప్రదం చేయాలని సంఘం నాయకులు నాగభూషణ, వెంకటేశ్వర బాబు, శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సభ ద్వారా నాయీబ్రాహ్మణల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోరనున్నట్లు తెలిపారు. మంత్రి సవిత, ఎంపీ పార్థసారధి, పలువురు కూటమి నాయకులను ఆహ్వానించామన్నారు. ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి జిల్లా నలుమూలలనుంచి నాయీబ్రాహ్మణులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నేడు మహిళా సదస్సు

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా ఎస్పీ వీ రత్న ఆధ్వ ర్యంలో జిల్లా పోలీసుశాఖ మహిళా సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా పోలీసు కార్యాలయం సోమవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఇందు లో మహిళల భద్రత-భవిష్యత్తుకు భరోసా అనే అంశంపై చర్చిస్తా రని, ఉదయం 10-30 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎస్పీతో పాటు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఆర్డీఓ సువర్ణ, డీఎస్పీ విజయ్‌కుమార్, పలువురు అధికారులు పాల్గొంటారని వివరించింది.

కంది పంటకు నిప్పు

ముదిగుబ్బ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు తన కంది పంటకు సోమవారం నిప్పు పెట్టారని, దీంతో దాదాపు రూ.1.50 లక్షల దాకా నష్టం వాటిల్లిందని మండలంలోని సిరిగా రిపల్లికు చెందిన రైతు నరసయ్యా శాస్త్రి వాపోయారు. 10 ఎకరాల్లో కంది పంట సాగు చేశానని, ఆరు ఎకరాల్లోని పంట కాలిపోయిందనీ, గ్రామస్థుల సాయంతో నాలుగు ఎకరాల్లోని పంటను కాపాడుకోగలిగానని అన్నారు. దీనిపై పట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ మండల కన్వీనర్ కరణం ప్రభాకర్, కోట్ల బాబి, టీడీపీ నాయకులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఆస్పత్రికి వస్తే... ముక్కు మూసుకోవాల్సిందే..!

- కొత్త రోగాలు వచ్చేలా పరిస్థితులు
- పరిసరాలలో దుర్వాసన.. శానిటేషన్ అధ్వానం
- నాసిరకం ఫినాయిల్ వినియోగం


రోగులతో కిటకిటలాడుతున్న హిందూపురం ఆసుపత్రి

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే రోగాలు నయం కావడం దెవుడెరుగు.. కొత్తగా రోగాలు రాకుండా ఉంటే చాలని ఇక్కడికి వచ్చేవారు అంటున్నారు. ఆసుపత్రిలోకి వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఎవరైనా రోగాలు నయం చేసుకోవడానికి ఆసుపత్రికి వస్తారు. కానీ హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే కొత్త రోగాలు వచ్చేలా ఉన్నాయని రోగులు చెబుతున్నారు. ఆరోగ్యం బాగలేక ఆసుపత్రికి వచ్చే వారికి తోడుగా ఎవరైనా వస్తే వాళ్లు లోనికి రావాలంటేనే భయపడుతున్నారు. అంటే శానిటేషన్ ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆసుపత్రిలోకి వెళ్లగానే దుర్వాసన గుప్పుమంటుంది. భరించలేని విధంగా దుర్గంధం వెదజల్లుతోంది. శానిటేషన్ నిర్వహకులు ఫినాయిల్, డెటాయిల్‌తో వార్డులు శుభ్రం చేయియాల్సి ఉంది. కానీ సువాసన వెదజల్లే ఫినాయిల్ కాకుండా నాసిరకం వాడుతున్నారని తెలుస్తోంది. ఇక డెటాయిల్ అయితే వాడటమే లేదు. కనీసం డెటాయిల్ సరఫరా కూడా చేయడంలేదని తెలుస్తోంది. అయితే డెటాయిల్ ఎందుకు సరఫరా చేయడంలేదో ఎవరికీ అర్థంకాని పరిస్థితి. పాత టెండర్‌దారులకు సమయం ముగుస్తుండటంతో తిరిగి వారికే శానిటేషన్ టెండర్‌లు వస్తాయాలేదా అనే అనుమానంతో ఉన్నట్లు తెలుస్తుంది. దీంతో వారు అధికంగా శ్రమ తీసుకొని డెటాయిల్ ఎందుకు సరఫరా చేయాలనుకున్నారో ఏమో అని సిబ్బంది మాట్లాడుకోవడం విశేషం. శానిటేషన్ సిబ్బందిని అడిగితే మేము పనిచేయడానికే ఉన్నామని, డెటాయిల్ వారు సరఫరా చేయలేదు అంటున్నారు. మాకు ఏ లిక్విడ్ ఇస్తున్నారో దానిని మాత్రమే ఉపయోగిస్తామన్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు దీనిపై శ్రద్ధ చూపడం లేదు.



ముక్కు, మూసుకుని వెళ్తున్న ప్రజలు

శానిటేషన్‌ను సీరియస్‌గా పరిగణిస్తున్నాం

- డాక్టర్ లింగణ్ణ, సూపరింటెండెంట్

శానిటేషన్‌ను సీరియస్‌గా పరిగణిస్తున్నాం. ప్రజల ఆరోగ్యమే ముఖ్యం. అలా కాదని ఎవరైనా ప్రవర్తిస్తే చర్యలు తప్పవు. శానిటేషన్ టెండర్‌లు దక్కించుకున్న వారికి సమయం ముగుస్తోందని, వారు డెటాయిల్ సరఫరా చేయడం లేదని తెలుస్తోందిఙ డ్రైనేజీ వ్యవస్థ కూడా అధ్వానంగా ఉంది. ఎప్పుడో పాతకాలపు కాలువలు కావున వాటిని కూడా మర్మమతులు చేపట్టాల్సి ఉంది. టెక్నికల్ ఇంజనీర్‌లు వచ్చి పరిశీలించి వెళ్లారు. త్వరలో అన్ని సమస్యలు చక్కబడతాయి.

అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన


మడకశిరలో సీడీపీఓకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మడకశిరటౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ ఉద్యోగులు తమ న్యాయబద్ధమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్‌లుగా మార్పు చేయాలని, హెల్పర్ ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్‌లైన్స్ ఇవ్వాలని, మెనూ చార్జీలు పెంచాలని, ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అంగన్‌వాడీ ఉద్యోగులు సీడీపీఓ నాగమల్లేశ్వరికి వినతిపత్రం అందజేశారు.

సోమందేపల్లి: కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సోమవారం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సాయిబాబా ఆలయం వద్ద నుంచి ర్యాలీగా వెళ్లి మణికంఠ కాలనీలో ఉన్న కార్యాలయం వద్ద బైఠాయించారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశులు మాట్లాడుతూ అంగన్‌వాడీల వేతనాన్ని పెంచి గ్రాట్యుటీ అమలు చేయాలన్నారు. పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ సిబ్బందికి అందించారు. ప్రాజెక్టు కార్యదర్శి శ్రీదేవి, రాధమ్మ, సావిత్రి, విజయలక్ష్మి, నాగరత్న పద్మావతి పాల్గొన్నారు.

పెనుకొండ: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షుడు పెడబల్లి బాబా ఆధ్వర్యంలో బ్యానర్లతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు జయమ్మ, బావమ్మ, మాబున్నీసా, సావిత్రమ్మ, లక్ష్మీదేవి, పద్మ, సరస్వతి, మీనాకుమా రి, శాంతిబాయి, అరుణ పాల్గొన్నారు.


పెనుకొండలో మానవహారంగా ఏర్పడ్డ అంగన్‌వాడీలు

నయనానందకరం.. శ్రీవారి కల్యాణం..


స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న పండితులు


తిలకిస్తున్న భక్తులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని శ్రీనివాస ట్యాకీస్ వద్ద ఉన్న బాలాజీ నగర్‌లో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భూదేవి, శ్రీదేవి సమేత స్వామివారి కల్యాణం నయనానందకరంగా సాగింది. మూలవిరాట్‌ను వివిధ అభిషేకాలు, అర్చనలు నిర్వహించి సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ మేళతాళాలలు, మంగళవాయిద్యాలతో పెళ్లి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకరించారు.

బాలికల చదువుకు ప్రాధాన్యం ఇవ్వండి


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రొళ్ల, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): బాలికల చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలని మహిళా శిశు అభివృద్ధి పథకం అధికారి నాగమల్లేశ్వరి కోరారు. సోమవారం రొళ్ల మండలం ఎం.రాయాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నాగమల్లేశ్వరి, తహసీల్దార్ షేక్షావలి, ఎంఈఓ శ్రీధర్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ బాలలను కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని, బాలలు కూడా తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాల్నారు. రొళ్ల మండలాన్ని బాల్యవివాహాలు లేని మండలంగా తయారు చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆర్‌డీటీ మహిళా అభివృద్ధి విభాగం టీమ్ లీడర్ ఆదినారాయణ, ఏరియా టీమ్ లీడర్ ఓబులేసు, ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నక్క, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

76 యూనిట్లకు 722 దరఖాస్తులు

గోరంట్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో బీసీ, ఈబీసీ, కాపులకు కార్పొరేషన్ల ద్వారా 76 యూనిట్లు మంజూరు చేయగా, 722మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీఓ నరేంద్రకుమార్ తెలిపారు. బీసీలకు 62, ఈబీసీలకు 4, కాపులకు 10 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ, బ్యాంక్ అధికారులతో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహించారు. గోరంట్ల ఏపీజీబీ శాఖ పరిధిలో బీసీలు 86మంది, కాపులు 11, ఈబీసీ 3, బూదిలి శాఖ నుంచి బీసీ 44, కాపులు 10, ఈబీసీ 2, గౌనివారిపల్లి శాఖ పరిధిలో బీసీ, ఈబీసీ 38మంది, కాపులు 3 రుణ యూనిట్లకోసం ఇంటర్వ్యూలకు హాజరైనట్లు తెలిపారు. అలాగే గోరంట్ల స్టేట్‌బ్యాంక్ పరిధిలో బీసీ 184 మంది, ఈబీసీలు 6, కాపులు 13 మంది హాజరయ్యారు. మంగళవారం వానవోలు ఏపీజీబీ, గోరంట్ల కరూర్‌వైశ్యాబ్యాంక్, కెనరాబ్యాంక్ పరిధిలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

మడకశిరటౌన్: మండలంలో బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకొన్నవారికి మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సోనీబాయి తెలిపారు. దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులు అందరూ ఆన్‌లైన్ అప్లికేషన్‌లతోపాటు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రాలు, విద్యార్హత సర్టిఫికెట్లు, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు. బ్యాంకు సంబంధించిన అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

హిందూపురం: రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి 20న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ల ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. హిందూపురం మండలంలో దరఖాస్తు చేసుకున్న 19వ జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివకుమార్ ఒక ప్రకటనలో కోరారు.

అమరాపురం: మండలంలో రుణాల కోసం దరఖాస్తు చేసుకొన్న వారికి బీసీ కార్పొరేషన్, ఈబీసీ కార్పొరేషన్, కాపు కార్పొరేషన్ సంబంధించిన దరఖాస్తుదారులందరికీ మంగళవారం ఉదయం 10.30 నుంచి 2 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామారావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మూడు బ్యాంకుల సమన్వయంతో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. దరఖాస్తుదారులు తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

మడకశిర రూరల్: బీసీ, కాపు కార్పొరేషన్ల రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నావారికి మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాట్లు ఎంపీడీఓ సోనియాబాయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభిస్తామన్నారు. అప్లికేషన్‌తో పాటు రేషన్‌కార్డు, ఆధార్ కార్డు కుల, విద్యా సర్టిఫికెట్లు, బ్యాంక్ పుస్తకం జిరాక్స్ కాపీలు, రెండో ఫొటోలు తీసుకురావాలన్నారు.


గోరంట్లలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీఓ నరేంద్రకుమార్


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ బీకే పార్థసారథి

భగీరథుడి విగ్రహావిష్కరణ

పరిగి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాలపల్లి గ్రామంలో హిందూపురం ఎంపీ బీకే పార్థసారథ భగీరథ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 2018 నుంచి 2019 వరకు గ్రామంలో భగీరథ విగ్రహావిష్కరణ వాయిదా పడుతూ ఇప్పటికి ఏర్పాటుకావడం సంతోషకరంగా ఉందన్నారు. జంగాలపల్లి గ్రామంలో 2016లో గ్రామానికి తారురోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అప్పటి టీడీపీ ప్రభుత్వంలో శాసనసభ్యుడిగా తాను రహదారి నిర్మాణం చేపట్టానన్నారు. ఇళ్ల నిర్మాణాలు కూడా అప్పుడే జరిగాయన్నారు. ఆలయ నిర్మాణం కోసం ప్రజల నుంచి వినతులు వచ్చాయని వాటిని త్వరలో పరిష్కరిస్తామన్నారు. అనంతరం గ్రామంలోని మహిళలు గ్రామం నుంచి కాటమప్ప ఆలయం వరకు జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. మండల కన్వీనర్ గోవింద రెడ్డి, సర్పంచ్ బాలాజీ, వడ్డే హనుమయ్య, శేఖర్, అశ్వత్థప్ప, శ్రీనివాసరెడ్డి, నరసింహులు, కుమార్, చౌడప్ప పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి

పెనుకొండ రూరల్: రైతుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీ బీకే పార్థసారథి సూచించారు. రొద్దం మండలంలోని మరువపల్లి గ్రామంలో తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు, రెవెన్యూ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలతో వచ్చే రైతులు, ప్రజలకు సహకరిస్తూ ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు పాల్గొన్నారు.

క్రీడాపోటీల విజేతలకు అభినందనలు


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో గుండుమల, ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మడకశిరటౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని వెటర్నరీ కళాశాల విద్యార్థులు తూర్పు గోదావరిలో జరిగిన క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచారు. సోమవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన వారిని అభినందించారు. ఖోఖో, అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభను కనబరిచారని విద్యార్థులను ప్రశంసించారు. అన్ని విభాగాల్లోనూ మడకశిర వెటర్నరీ కళాశాల విద్యార్థుల ఉత్తమ ప్రతిభ కనబరిచారని, వారికి మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శివకుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు భూములను రిజిస్ట్రేషన్ చేసుకోండి


మాట్లాడుతున్న ఏఓ వీరనరేష్

గుడిబండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ భూములను రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ వీరనరేష్ సూచించారు. సోమవారం మండలంలోని జి.మోరుబాగల్, మోరుబాగల్, దేవరహట్టి, జంబులబండ గ్రామాల్లో వ్యవసాయ రైతుసేవా కేంద్రం సిబ్బంది రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రైతులతో సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రైతులు తమ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. భూఆధారిత నమోదు చేసుకుంటేనే ప్రభుత్వం నుంచి ఇనపుట్‌సబ్సిడీ, సున్నావడ్డీ, ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ తదితర పథకాలు అందేందుకు అవకాశం ఉందన్నారు. రైతులు రైతుసేవా కేంద్రానికి ఆధార్‌కార్డు, ఫోన్, పట్టాదారు పాసుపుస్తకం, తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఏఓ వెంట రైతుసేవా కేంద్రం సిబ్బంది నరసింహమూర్తి, విద్య, రమేష్ పాల్గొన్నారు.

యలహంకలో అదృశ్యం.. హిందూపురంలో ప్రత్యక్షం


బాలుడిని తల్లికి అప్పగిస్తున్న సీఐ జనార్దన్

హిందూపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ముకేష్ సింగ్ అనే 8 సంవత్సరాలు బాలుడు కర్ణాటకలోని యలహంకలో అదృశ్యమై హిందూపురంలో ప్రత్యక్షమైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. డీఎస్పీ మహేష్ తెలిపిన వివరాల మేరకు బెంగళూరుకి చెందిన సరిత కుమారుడు ముకేష్ సింగ్ ఆదివారం యలహంక రైల్వే స్టేషన్లో తప్పిపోయాడు. అక్కడి నుంచి హిందూపురం వైపు వస్తున్న రైలు ఎక్కి వచ్చేశాడు. స్టేషన్‌లో దిగి ఆడుకుంటుండగా గమనించిన స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆ బాలుడిని పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్లి వివరాలు అడగ్గా తనది ఎలహంక అని తల్లి పేరు సరిత అని మాత్రమే చెప్పారు. పోలీసులు బాలుడి ఫొటో యలహంక పోలీసులకు పంపించారు. ఆదివారం రైల్వేస్టేషన్లో సీసీ ఫుటేజీలు పరిశీలించి వివరాలు ఆరా తీసి తల్లి సరితకు సమాచారం అందించారు. ఆమె సోమవారం హిందూపురం పోలీస్‌స్టేషన్ చేరుకోగా, వారి వద్ద ఉన్న బాలుడు ఆధారాలను పరిశీలించిన తరువాత ముకేష్ సింగ్‌ని తల్లికి అప్పగించినట్లు డీఎస్పీ తెలిపారు.

అడవులకు నిప్పుపెడితే జైలుకే..: ఎస్పీ

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అడవులకు నిప్పుపెడితే జైలు శిక్ష తప్పదని ఎస్పీ రత్న సోమవారం ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల కొందరు ఆకతా యిలు, గొర్రెల కాపరులు కొండలకు, అడవులకు నిప్పుపెట్టడం దారుణమన్నారు. వీరి చేష్టల వల్ల దట్టమైన అడవులు అంతరిం చిపోతున్నాయన్నారు. లక్షలాది వన్యప్రాణులు ఆహుతై పోతున్నాయన్నారు. ఫలితంగా పర్యావరణం సమతుల్యం దెబ్బతింటుంద న్నారు. అలా నిప్పు పెట్టిన వారి ఆచూకి తెలిపాలని ఎస్పీ కోరారు.

ఉరుసు మహోత్సవాలు ప్రారంభం

కొత్తచెరువు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మస్తాన్‌వలి ఉరుసు మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. రాత్రి గంధం పూజ, చాదర్ గలఫ్ కార్యక్రమాన్ని ముస్లింలు, మత పెద్దలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, కూటమి నాయకులు పెద్ద ఎత్తున హాజరై ప్రార్థనలు చేశారు. బుధవారం రాత్రి 9గంటలకు జియారత్ కార్యక్రమంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి.